



ఇక తగ్గాల్సిందే! పుష్పా

శేషాచలమే మా అడ్డా అంటే కుదరదు

INTERVIEW



టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్

జగన్ జమానాలో శేషాచలం అడవులను కొల్లగొట్టిన ఎర్ర దొంగల పనిపట్టేందుకు కూటమి ప్రభుత్వం కఠిన చర్యలకు పూనుకుంది. ఎర్రచందనం దుంగల విచ్చలవిడి దోపిడీకి చెక్ పెట్టాలని నిర్ణయించుకుంది. ఏకంగా గుజరాత్ గోడౌన్లపైనే మన టాస్క్‌ఫోర్స్ మెరుపుదాడి చేసింది. రూ3.5కోట్ల విలువచేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. దీంతో ఎర్ర దొంగల గుండెల్లో దడ మొదలైంది. కూలీల మొదలు బడాల దాకా ఎవరినీ వదిలే ప్రశ్నే లేదని టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ హెచ్చరిస్తున్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నియంత్రణపై తీసుకుంటున్న చర్యలపై 'ఆంధ్రజ్యోతి'తో ఆయన సంభాషణలోని ముఖ్యాంశాలు.. ఆయన మాటల్లోనే.. - తిరుపతి, ఆంధ్రజ్యోతి



మన అడవుల్లోనే దొరికే మేలురకం ఎర్ర చందనం కరువు సీమలో కల్పవృక్షం లాంటిది. అందుకే శేషాచలం కొండలను బయో అట్మాస్ఫియర్ అడవులుగా యునెస్కో గుర్తించింది. చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాలలోని శేషాచల అటవీప్రాంతంలో 5.2 లక్షల హెక్టార్లలో ఎర్ర చందనం విస్తరించివుంది. ఎంతో విశిష్ట సుగుణాలు కల్గివుంది కాబట్టే విదేశీ మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. అందుకే 'పుష్పరాజ్'ల కన్ను మన కొండలపై పడింది. ఏటా 2వేల టన్నులకు పైగా ఎర్రచందనం దుంగలను 'పుష్పరాజ్'లు గుట్టుచప్పుడు కాకుండా విదేశాలకు తరలించినట్టు అంచనా. దీని విలువ 2వేల కోట్లు.

- డ్రోన్స్‌తో జల్లెడ

కాపాడుకుంటాం

ఎర్రచందనం సంపదను పరిరక్షించే దిశగా ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ ఏర్పడింది. శేషాచలం అడవులను తమ అడ్డాలుగా మార్చుకున్నవారి ఆట కట్టిస్తాం. నిఘా పెంచాం. జల్లెడ పడుతాం. కఠినంగా వ్యవహరిస్తాం. అటవీ శాఖతో కలిసి శేషాచలంను కాపాడుకుంటాం. పెద్దఎత్తున దుంగలను స్వాధీనం చేసుకుంటున్నాం. గతంతో పోలిస్తే ఇప్పుడు కూలీల సంఖ్య తగ్గిందనే చెప్పవచ్చు.

నిరంతర కూంబింగ్

కూలీలను అడవుల్లోకి వెళ్ళనివ్వకుండా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు కట్టుదిట్టం చేశాం. రహదారులలో నిత్యం తనిఖీలు నిర్వహిస్తున్నాం. అన్నమయ్య, కడప, తిరుపతి జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతంలో మా బృందాలు నిరంతరం కూంబింగ్ చేస్తున్నాయి. అడవుల్లో బేస్ క్యాంపులు, వాచ్ టవర్లను ఏర్పాటు చేశాం. అక్కడ సిబ్బంది కాపలాగా ఉంటున్నారు.

బడాలను వదలం : ఎర్రచందనం దుంగలతో పాటు బడా దొంగలను కూడా అరెస్టు చేస్తున్నాం. అందులో భాగంగానే రెండు రోజుల క్రితం గుజరాత్‌లోని గోడౌన్లపై దాడిచేసి ముగ్గురు ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేసి తీసుకొచ్చాం. చిన్న కూలీ చిక్కినా మూలాలుకు వెళ్లి బడా స్మగ్లర్లను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నాం.

శాటిలైట్ ఫోన్‌లు


శేషాచల కొండల్లో మొబైల్ ఫోన్ సిగ్నల్స్ రానిచోట శాటిలైట్ ఫోన్లు, బైనాక్యులర్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఇటీవల స్మగ్లర్ల జాడను గుర్తించిన మా సిబ్బంది శాటిలైట్ ఫోన్లతోనే అందరికీ సమాచారమిచ్చారు. దీంతో సులభంగా ఆయా ప్రాంతాలకు వెళ్లగలుగుతున్నాం. శాటిలైట్ ఫోన్లు సత్ఫలితాలు వస్తున్నాయి.

ఆధునిక డ్రోన్‌లు వస్తున్నాయ్

అభయారణ్యాన్ని అన్వేషించాలంటే సాధారణ డ్రోన్స్ సరిపోవు. ప్రత్యేకమైన థర్మోస్టాటిస్టిక్ డ్రోన్స్ కావాలి. వాటికి ఇన్‌ఫ్రారెడ్ కెమెరాలు అవసరం. వీటితో అయితేనే చెట్ల కింద ఉండే మనుషులతో పాటు, జంతువుల కదలికలను కూడా గుర్తించవచ్చు. ఇటువంటి మూడు డ్రోన్స్ ప్రధానమైన 3బేస్‌లకు కావాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలోనే అందుబాటులోకి వస్తాయి.



టాస్క్‌ఫోర్స్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు



గుజరాత్ గోడౌన్లపై మెరుపుదాడి చేసి రూ3.5కోట్ల విలువచేసే ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసిన తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసులను సీఎం చంద్రబాబు నాయుడు బుధవారం తన 'ఎక్స్' వేదికగా ఇలా అభినందించారు..

"మన రాష్ట్రంలో ఎర్రచందనం స్మగ్లింగ్‌ను అరికట్టేందుకు జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరిస్తాం. మన సహజ వనరులను దోపిడీ చేయడానికి ప్రయత్నించేవారు తీవ్ర పరిణామాలను ఎదుర్కొంటారు. ఈ అక్రమ కార్యకలాపాలను అరికట్టడంలో తిరుపతి రెడ్ సాండర్స్ టాస్క్‌ఫోర్స్ శ్రద్ధతో కృషిచేసినందుకు అభినందిస్తున్నా"



ప్రగతి అంటే ఇదీ!



27 ఏప్రిల్ 2016

శ్రీసిటీ సెజ్‌లో ఇసుజు కర్మాగారాన్ని ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రారంభించారు. వాహనాల ఉత్పత్తి మొదలైంది.

తొలి వాహనం తయారీకి ఇసుజు పూనుకున్నపుడు సీఎంగా ఉన్న చంద్రబాబే.. లక్షవ వాహనం ఉత్పత్తి సమయంలోనూ తిరిగి అదే స్థానంలో ఉండడం విశేషం. వస్తు రవాణాకు విశేషంగా ఉపయోగపడే వాహనాలను శ్రీసిటీలో 107 ఎకరాల విస్తీర్ణంలో ఈ పరిశ్రమ ఏర్పాటైంది. 1600 మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. డి-మాక్స్, ఎంయు-ఎక్స్ ఎస్‌యూవీలను ఇసుజు మోటర్స్ ఇండియా పరిశ్రమ ఉత్పత్తి చేస్తోంది. పలు దేశాలకు వీటిని ఎగుమతి చేస్తోంది. ఇప్పటికే లక్ష వాహనాలు ఈ పరిశ్రమలో తయారయ్యాయి. బుధవారం లక్షవ వాహనాన్ని ప్రారంభించే కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ జపనీస్ కంపెనీ గ్రూప్ ఛైర్మన్ సాటో గౌరవ అతిథులుగా హాజరయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, పరిశ్రమల శాఖ మంత్రి టీడీ భరత్ అభినందన సందేశాలను యువరాజ్ వినిపించారు. ఇసుజు ఇంజనీరింగ్ బిజినెస్ సెంటర్ ఇండియా ఛైర్మన్ సుకామోటో ఐఎంఐ వృద్ధి ప్రయాణాన్ని వివరించారు. ఇసుజు మోటర్స్ ప్రెసిడెంట్ సీఈవో షిన్‌సుకే మినామి, మిత్సుబిషి కార్పొరేషన్ మొబిలిటీ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ వైస్‌ప్రెసిడెంట్ అండ్ గ్రూప్ సీఈవో షిగేరు వాకబయాషీ వర్చువల్ విధానంలో ఇసుజు టీంను అభినందించారు.



శ్రీసిటీలోని ఇసుజు ప్లాంట్

- వరదయ్యపాళెం, ఆంధ్రజ్యోతి

ఇసుజు సంస్థ నాణ్యత, నిబద్ధతకు ఇది నిదర్శనం. నైపుణ్యం కలిగిన మానవ శక్తి, అధునాతన సాంకేతికత, అత్యుత్తమ పనివిధానాల ద్వారా దీనిని సాధించాం. సంస్థలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డిప్లొమా హోల్డర్ల ప్రతిభ గొప్పది. శ్రీసిటీ సహకారం ఎనలేనిది.

- ఐఎంఐ అధ్యక్షుడు, ఎండీ రాజేష్ మిట్టల్



18 డిసెంబరు 2024

శ్రీసిటీలో ఉత్పత్తి చేసిన ఇసుజు లక్షవ వాహనాన్ని సగర్వంగా సంస్థ విడుదల చేసింది.

దేశీయ తయారీ నైపుణ్యం, ప్రపంచ పోటీతత్వానికి సాక్ష్యం ఇది. ప్రపంచ స్థాయి పరిశ్రమలను ఆకర్షిస్తూ నూతన ఆవిష్కరణలు, ఉద్యోగ కల్పన, వృద్ధి సాధన దిశగా మంచి పర్యావరణ వ్యవస్థను నిర్మించడంతో ఆంధ్రప్రదేశ్ అంకితభావంతో ఉంది. స్థానిక ప్రతిభను ఇసుజు ప్రోత్సహించడం గ్రేట్. వెనుకబడిన ప్రాంతంలో పారిశ్రామిక నగరాన్ని ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డికి అభినందనలు.

- రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ కార్యదర్శి యువరాజ్

ప్రపంచస్థాయి పారిశ్రామిక హబ్‌గా శ్రీసిటీ పాత్ర గర్వకారణంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకున్న మొదటి ఆటోమొబైల్ తయారీదారు ఇసుజు. ఇసుజు విజయం శ్రీసిటీలోని పెట్టుబడుల స్నేహపూర్వక పర్యావరణ వ్యవస్థకు అద్దం పడుతూ స్ఫూర్తినిస్తోంది.

- శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి

ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం)/నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్య ధోరణి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు. నాయుడుపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న జి.చంద్రయ్య కొంతకాలంగా క్రమశిక్షణ లోపించి ప్రజలు, పిటిషనర్ల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. నాలుగు రోజుల కిందట ఈయన చిట్టమూరు మండలం కొత్తగుంట గ్రామంలోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో యువకుడు పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో ఆ యువకుడు చిట్టమూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు చంద్రయ్యపై కేసు నమోదైంది. దీంతో చంద్రయ్యను ఎస్పీ సస్పెండ్ చేశారు. అలాగే, తిరుపతి సాయుధ దళం విభాగంలో విధులు నిర్వహిస్తున్న బి.రవికుమార్ క్రమశిక్షణ లోపించడం, ఇతర ఆరోపణలపై సస్పెండయ్యారు. పోలీసులు విధి నిర్వహణలో అలసత్వం, ఫిర్యాదుదారుల పట్ల నిర్లక్ష్యంగా ప్రవర్తిస్తే సహించేది లేదని ఎస్పీ హెచ్చరించారు.



విన్యాసాలు అదరహో

మెజెస్టిక్ ఆర్మీ గుర్రంపై ఎన్‌సీసీ క్యాడెట్లు విన్యాసాలు చేశారు. గుర్రపుస్వారీతో అలరించారు. గుర్రాలతో ఫైర్‌జంప్, జంపింగ్ వంటి విన్యాసాలు అలరించాయి.

- వివరాలు 8లో -

600 బస్తాల రేషన్ బియ్యం పట్టివేత

సూళ్లూరుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో బుధవారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ప్రత్యేక నిఘా విభాగం అధికారులు పట్టుకున్నారు. హోలీక్రాస్ కూడలి వద్ద ఓ లారీని తనిఖీ చేయగా 600కుపైగా రేషన్ బియ్యం బస్తాలు పట్టుబడ్డాయి. ఇందులో 560 బస్తాలు ఏపీకి, మిగిలినవి తమిళనాడు రేషన్ బియ్యంగా గుర్తించారు. తమిళనాడు రేషన్ బియ్యాన్ని ఆ రాష్ట్రంలోని ఏళావూరు నుంచి, ఆంధ్రా రేషన్ బియ్యాన్ని తడ నుంచి తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుబడిన లారీని స్థానిక పోలీసులకు అప్పగించగా, వారు సివిల్ సప్లయీస్ అధికారులకు సమాచారం ఇచ్చి గోదాముకు తరలించారు. డ్రైవర్ రఫీని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. లారీ యజమాని వేనాటి భాస్కర్ రెడ్డి, బియ్యం అక్రమ రవాణాకు పాల్పడుతున్న మణికంఠ రెడ్డిపై కేసు నమోదు చేశారు.



పట్టుబడిన రేషన్ బియ్యం

ఆగని రేషన్ బియ్యం అక్రమ రవాణా

ప్రభుత్వం పేదల కోసం అందజేస్తున్న రేషన్ బియ్యం మాఫియాకు వరంగా మారింది. సూళ్లూరుపేట ప్రాంతం రాష్ట్ర సరిహద్దు కావడంతో ఇటు తమిళ బియ్యాన్ని కూడా తెచ్చి అక్రమ రవాణా చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని డీలర్ల వద్ద నుంచి కొనుగోలు చేసి నెల్లూరు, కాకినాడ ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు 5 నుంచి 8 లారీల్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా స్థానిక అధికారులు నెలకొకసారి ఒక వాహనాన్ని పట్టుకుని నామమాత్రంగా కేసులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో రెండు వారాల క్రితం బియ్యం అక్రమ రవాణాను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ బృందం దాడులు చేస్తుండడంతో పెద్ద మొత్తంలో రేషన్ బియ్యం పట్టుబడుతోంది.



అమ్మో.. చలి

వణికిస్తున్న చలి. అనారోగ్యాలనూ తీసుకొస్తోంది. ఈ వాతావరణానికి ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై

కథనం 8లో..

శ్రీకాళహస్తిలో 700 కిలోలు స్వాధీనం

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 700కిలోల రేషన్ బియ్యంతో పాటు ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన ప్రకారం.. చెన్నై రోడ్డులోని సాయిబాబా గుడి సమీపంలో 700 కిలోల రేషన్‌బియ్యాన్ని సహదేవ తన ఆటోలోకి ఎక్కించాడు. సమాచారం అందుకున్న సీఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆటో సహా రేషన్‌బియాన్ని స్వాధీనం చేసుకున్నారు. సహదేవను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. శ్రీకాళహస్తిలో రేషన్ బియ్యం అక్రమ రవాణా అధికమైంది. నిఘాపై పోలీసు ఉన్నతాధికారులు కూడా ప్రత్యేక దృష్టిసారించినట్లు తెలిసింది. రెండుసార్లు పక్కా సమాచారంతో రేషన్‌బియ్యాన్ని పట్టుకునేందుకు యత్నించారు. ఇంటి దొంగలు అక్రమార్కులకు సమాచారం లీక్ చేయడంతో ఆపరేషన్ విఫలమైనట్లు విశ్వసనీయ సమాచారం.



సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌ను కమ్మేసిన పొగమంచు

బలపడిన అల్పపీడనం

- నేడు, రేపు వానలు పడే అవకాశం

సూళ్లూరుపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడింది. తమిళనాడు తీరానికి వాయవ్యదిశగా పయనిస్తుండడంతో గురు, శుక్రవారాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో తీరం వెంబడి చలిగాలుల తీవ్రత, తీరప్రాంతాల్లో అలల ఉధృతి అధికంగా ఉంటుంది. సూళ్లూరుపేటలో బుధవారం చలిగాలులుతో కూడిన చిరు జల్లులు పడ్డాయి. ఇక, పొగమంచు అధికంగా ఉంది. సూళ్లూరుపేటలో మధ్యాహ్నం జాతీయ జాతీయ రహదారి, రైల్వే స్టేషన్‌ను పొగమంచు కమ్మేసింది. లైట్లు వేసుకొని వాహనదారులు రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

బాల కార్మికులుంటే యజమానులపై కేసులు


అవగాహన కల్పిస్తున్న కార్మిక శాఖాధికారి ఆనందబాబు

పాకాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బాలలను పనిలో పెట్టుకుంటే యజమానులకు శిక్ష తప్పదని పీలేరు కార్మిక శాఖాధికారి ఆనందబాబు హెచ్చరించారు. బుధవారం పాకాలలో ఆపరేషన్ స్వేచ్ఛలో భాగంగా గ్రేట్ విజన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు సుబ్రహ్మణ్యబాబు ఎంఈవోలు బాబ్జీ, లింగయ్యలతో కలిసి బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. పిల్లలను బడిలో చేర్పించాలని, వారిని పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. 18 ఏళ్లలోపు పిల్లలు నిరాధరణకు గురైనా.. ఇబ్బందుల్లో ఉన్నా వారి విద్య, వైద్యానికి స్వచ్ఛంద సంస్థ సహకరిస్తుందని తెలిపారు. వివరాలకు ఫోన్ నంబర్లు 9492555228, 9493 871884 లను సంప్రదించాలని కోరారు. హెడ్‌కానిస్టేబుల్ అర్జున్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కిరణ్మయి పాల్గొన్నారు.

● చంద్రగిరి: బాల కార్మికులతో పనిచేయిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని లేబర్ అసిస్టెంట్ కమిషనర్ చిన్న లాలప్ప అన్నారు. బాల కార్మికుల నిర్మూలనకై ప్రత్యేక తనిఖీలలో భాగంగా చంద్రగిరిలో పలు దుకాణాలలతో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల కార్మికులతో పనిచేయించడం నేరమని సూచించారు. తిరుపూరు కాటన్ బజార్‌లో తనిఖీలు చేయగా అందులో చంద్రగిరి బీడీ కాలనీకి చెందిన ఓ బాలిక, వెంకటగిరికి చెందిన ఓ బాలుడు పనిచేస్తుండగా అధికారులు గుర్తించారు. దీంతో యాజమానిపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో చంద్రగిరి లేబర్ ఆఫీసర్ రాజయ్య, తిరుపతి, రేణిగుంట లేబర్ ఆఫీసర్లు శ్రీమాన్ నారాయణ, ప్రవీణ్ కుమార్, చంద్రగిరి ఎస్ఐ అనిత, ఐసీడీఎస్ అధికారి కల్పన, ప్రగతి ఎన్జీవో ప్రతినిధి రాజా రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ జయచంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కోతకు గురవుతున్న కల్వర్టు


స్వర్ణముఖినదిఒడ్డున కోతకు గురవుతున్న కల్వర్టు

చంద్రగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం నాగయ్యగారిపల్లె వద్ద స్వర్ణముఖినదిఒడ్డున తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు కోతకు గురవుతుంది. తుఫాన్ కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు స్వర్ణముఖినదిలో వరద నీరు ఉధృతంగా సాగుతోంది. దీంతో తాత్కాలికంగా నిర్మించిన కల్వర్టు కోతకు గురైతే నాగయ్యగారి పల్లె, కొటాల, రామిరెడ్డిపల్లె నుంచి చంద్రగిరికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. స్వర్ణముఖినది నుంచి అక్రమంగా టిప్పర్లలో ఇసుక తరలించడంతోనే కల్వర్టు కుంగిపో యిందని గ్రామస్తులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలిక కల్వర్టుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పెంచిన కరెంటు చార్జీలు తగ్గించాలి


మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత

పాకాల, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సర్దుబాబు పేరుతో వినియోగదారులకు పెంచిన కరెంటు చార్జీలు వెంటనే తగ్గించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత డిమాండు చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు ఎదుట బుధవారం ఆమె వివిధ సంఘాలతో కలిసి నిరసన తెలుపుతూ విద్యుత్ బిల్లులను దహనం చేశారు. పెరిగిన నిత్యావసర ధరలతో జనం అల్లాడుతుంటే సర్దుబాటు పేరుతో వారిపై భారం మోపడం అన్యాయమన్నారు. కరెంటు చార్జీలు తగ్గకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మాజీ ఉపాధ్యక్షుడు మధుసూదన్ రావు, సుగుణ, కేశవరెడ్డి, ఆటో యూనియన్ నాయకులు రాజు, లక్ష్మయ్య, నవీన్, దేవేంద్ర పాల్గొన్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన మురళి, తేజ, సంగీత

తిరుచానూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. బాధితుల కథనం మేరకు.. తిరుపతి రూరల్ మండలం పాడిపేట హౌసింగ్ కాలనీలో మురళి, తేజ దంపతులు నివాసం ఉంటున్నారు. తిరుపతి జబ్బార్ లేఅవుట్‌లో ఓ అంత్యక్రియల కార్యక్రమానికి ద్విచక్రవాహనంలో హాజరై తిరిగి తిరుపతి నుంచి పాడిపేటకు బయలుదేరారు. తిరుచానూరు-ముండ్లపూడి రోడ్డులో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొన్నారు. ప్రమాదంలో మురళి, తేజ దంపతులతో పాటు మరో ద్విచక్రవాహనంలోని తిరుపతి శేషాద్రినగర్‌కు చెందిన సంగీత తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108కు సమాచారం అందించినా.. అర్ధ గంటకు పైగా ఘటనా స్థలానికి అంబులెన్సు చేరుకోలేదు. విషయం తెలుసుకున్న తిరుచానూరు ఎస్సై అరుణ చేరుకొని గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌సీపురంలో ప్రబలిన విషజ్వరాలు


వైద్యం కోసం ఆసుపత్రిలో వేచిఉన్న రోగులు

రామచంద్రాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్‌సీపురం మండలంలో గత 20 రోజులుగా విషజ్వరాలు ప్రబలి ప్రజలు అల్లాడుతున్నారు. నెల రోజులుగా వరుస తుఫాన్ నేపథ్యంలో గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. నడవలూరు, గంగిరెడ్డిపల్లి, గెరికచేనుపల్లె, సూరావారిపల్లె గ్రామాల్లో పలువురు జ్వరాల బారిన పడ్డారు. నడవలూరు గ్రామంలో సగానికి పైగా జ్వరం, కీళ్లనొప్పులతో అల్లాడుతున్నారు. సరైన వైద్యం అందక తిరుపతికి వెళ్లి వేలాది రూపాయలు ఖర్చు పెట్టుకుంటున్నారు. మండలంలో కమ్మపల్లి, బాదూరులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలున్నా పనివేళలకంటే ముందు ఆస్పత్రిని మూసి వెళుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండలంలో సుమారు 15 ప్రైవేటు వైద్యశాలలకు పైగా ఉన్నాయి. సాయంత్రమైతే రోగులతో కిటకిటలాడుతున్నాయి. రాత్రుల్లో జ్వరాలతో ప్రజలు దిక్కుతోచక అల్లాడుతున్నారు. వైద్యాధికారులు స్పందించి గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చీటీ నగదు మాయంపై ఫిర్యాదు


ఫిర్యాదు చేయుదానికి వచ్చిన కూచువారిపల్లె వాసులు

చంద్రగిరి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువ కూచువారిపల్లె ఎస్టీ కాలనీలో గ్రామస్తులు పోగేసుకున్న చీటీ డబ్బులు రూ.1.30 లక్షలు మాయం కావడంతో గ్రామస్తులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎగువ కూచువారిపల్లె ఎస్టీ కాలనీ వాసులు సంక్రాంతి పండుగకు ఇంట్లో ఖర్చుల కోసం ఏటా గ్రామ పెద్ద పరంధామయ్య వద్ద చీటీ వేసుకుంటారు. అయితే గత రెండు రోజుల క్రితం పరంధామయ్య తన ఇంట్లో డబ్బులు కనిపించకపోవడంతో గ్రామస్తులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

వ్యభిచార గృహంపై దాడి.. ముగ్గురి అరెస్టు

తిరుచానూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ హోమ్ స్టేపై దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశారు. సీఐ సునీల్‌కుమార్ కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం బళ్లారికి చెందిన కుమార్, దేవళంపేటకు చెందిన పార్థసారథి గత కొంతకాలంగా తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీ విద్యుత్‌నగర్ వద్దనున్న విస్టా విల్లాస్ హోమ్‌స్టేకు బయటి నుంచి యువతులను రప్పించి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. బుధవారం సాయంత్రం అందిన రహస్య సమాచారం మేరకు పోలీసులు ఆ హోటల్‌పై సోదాలు నిర్వహించారు. నిర్వాహకులు కుమార్, పార్థసారథి, విటుడు సోమశేఖర్‌ను అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పట్టుబడిన యువతులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపారు.

చిన్నగొట్టిగల్లులో ఆధార్ ప్రత్యేక శిబిరం


ఆధార్ నమోదు చేస్తున్న సిబ్బంది

భాకరాపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆధార్ కార్డులో మార్పులు, చేర్పులు చేసుకోవడానికి ఆధార్ ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో గిడ్డయ్య తెలిపారు. చిన్నగొట్టిగల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో బుధవారం 38 మంది విద్యార్థులు తమ ఆధార్ కార్డుల్లో మార్పులు, చేర్పులు చేసుకున్నారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు వేంకటేశ్వరరెడ్డి, వికాస్‌రెడ్డి పాల్గొన్నారు.

చంద్రగిరి

పవర్ లైన్ షిఫ్టింగ్ పరిశీలన



రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి విమానాశ్రయం సమీపంలో 132 ఈహెచ్‌టీ అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ 6 లైన్ షిఫ్టింగ్ పనులను కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈ పనుల నిమిత్తం నిధుల కోసం ట్రాన్స్‌కో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆచరణ్మాతక ప్రణాళికతో పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు సురేష్‌బాబు, విమానాశ్రయ, ట్రాన్స్‌కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే గ్రామీణాభివృద్ధి

తిరుపతి డివిజన్ డీఎల్‌పీవో సురేష్‌నాయుడు


బొప్పరాజుపల్లె-గంగుడుపల్లె మార్గంలో తవ్వుతున్న గ్రావెల్

రామచంద్రాపురం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): అందరి సహకారంతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని తిరుపతి డివిజన్ డీఎల్‌పీవో సురేష్‌నాయుడు అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో సుస్థిర అభివృద్ధి జరగాలంటే పారిశుధ్యం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రతపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎంపీడీవో ఇందిరమ్మ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం కాకుండా గ్రామసభలు ఏర్పాటు చేసి అభివృద్ధి పనులు గుర్తించాలని.. అవసరమైన పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో అంటు వ్యాధులు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీవో హంసవేణి, ఎంఈవో మార్కొండనాయుడు, కమ్మపల్లి పీహెచ్‌సీ వైద్యులు జావిద్‌కుమార్, వెలుగు ఏపీఎం గురుమూర్తి, అధికారులు పవన్‌రాజు, రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు అల్లెబ్బ, సంజీవరెడ్డి, రజని, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● భాకరాపేట: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు పనిచేయాలని డీపీఆర్సీ అధికారి షణ్ముగం అన్నారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ సమావేశ మందిరంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేదరికం లేని మెరుగైన జీవనోపాధి, ఆరోగ్యం, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, తగినంత నీరు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీపీ యుగంధర్ రెడ్డి, ఎంపీడీవో గిడ్డయ్య, ఈవోపీఆర్డీ సోమశేఖరరెడ్డి, ఏపీఎం స్వర్ణలత, ఎంపీహెచ్‌వో అమరనాథరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుహాసిని, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో రెండురోజుల పాటు నిర్వహించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల శిక్షణ బుధవారంతో ముగిసింది. పలువురు పవర్‌పాయింట్ ప్రజంటేషన్‌తో అవగాహన కల్పించారు. ఏపీఎం పత్తిపాటి నాగేశ్వరరావు, ఎంపీహెచ్‌వో దేవయాని, పంచాయతీ కార్యదర్శి ఎ.మధుసూదన్, సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్నారులపై అకృత్యాలను అరికట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, వేదికపై సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో

నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో అంగన్ వాడీలు చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. పిల్లలకు కొత్తవారు వచ్చి ఏమైనా చెబితే అంగన్‌వాడీలకు, తల్లిదండ్రులకు తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. తిరుపతి జిల్లా వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ రోజామణి మాట్లాడుతూ మహిళల పట్ల గృహహింస, చిన్నపిల్లల మీద జరుగుతున్న అకృత్యాలు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అర్బన్, రూరల్ సీఐలు బాబి పాల్గొన్నారు.

కళ్లల్లో కారం చల్లి.. చైను లాక్కెళ్లి

● తిరుపతిలో దుండగుల దారుణం

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కళ్లలో కారం చల్లి.. ఆమె మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లారా దుండగులు. ఈ ఘటన బుధవారం తిరుపతి రూరల్ అవిలాల వాణినగర్‌లో చోటు చేసుకుంది. జిల్లా అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి తెలిపిన ప్రకారం.. అవిలాల వాణినగర్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మధు బుధవారం తన ఇద్దరు పిల్లలను స్కూలుకు తీసుకెళ్లారు. దీనిని గమనించిన ఓ వ్యక్తి.. మహిళతో కలిసి ఆ ఇంటికి వెళ్లారు. మీ భర్త ఎక్కడకు వెళ్లాడు? ఏమి చేస్తున్నాడంటూ నాగస్వాతిని మెల్లగా మాటల్లో దింపారు. మీరేం చేస్తున్నారంటూ మాట్లాడుతూ ఊహించని రీతిలో తమ వద్ద ఉన్న కారం పొడిని ఆమె కళ్లలో చల్లారు. కళ్లు మంటలతో రుద్దుకుంటూ ఉండగా ఆమె మెడలోని దాదాపు 28 గ్రాముల బంగారు చైను, మొబైల్ ఫోన్ లాక్కొని వెళ్లిపోయారు. ఇంటికొచ్చిన భర్తకు విషయం చెప్పారామె. వీరి ఫిర్యాదుతో తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు అదనపు ఎస్పీ చెప్పారు.

కలెక్టర్‌ను కలిసిన ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్



తిరుపతి(జీవకోన), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్‌ను రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ పూరిమిట్ల కుమారి (కుమారమ్మ) బుధవారం కలెక్టరేట్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ సబ్ ప్లాన్, సబ్సిడీ లోన్ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేయాలని కోరారు. రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన ఆమెను కలెక్టర్ అభినందించారు.

వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోండి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న శేషగిరిరావు

తిరుపతి(లీలామహల్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఫిబ్రవరి 2న జరగనున్న బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి అర్బన్ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సీఆర్‌కే శేషగిరిరావు కోరారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో సంఘ సభ్యులతో కలిసి ఆయన కరపత్రాలు ఆవిష్కరించారు. శ్రీవెంకటగాయత్రి సేవా ట్రస్ట్, తిరుపతి అర్బన్ బ్రహ్మణ సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నామని, వివరాలకు 7013042281, 9440271154లలో సంప్రదించాలని కోరారు. సంఘ సభ్యులు విశ్వనాథ్, కామేశ్వరరావు, కుమారస్వామి, రాజేంద్రప్రసాద్, జయలక్ష్మి, పద్మావతి, లత, అపర్ణ పాల్గొన్నారు.

అర్జీలను పరిష్కరించాలి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.హేమలత ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అర్జీలను అక్కడిక్కడే పరిష్కరిస్తామని కలెక్టర్ ప్రకటించారని, అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు.

వెటర్నరీ వర్సిటీలో ముగిసిన శిక్షణ


సర్టిఫికెట్లు అందజేస్తున్న డీఈ శోభామణి, డాక్టర్ సుజాత తదితరులు

తిరుపతి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో నిరంతర పశువైద్య విద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో శాస్త్రీయ పద్ధతుల్లో సీమపందుల పెంపకంపై మూడ్రోజులపాటు నిర్వహించిన వ్యవస్థాపక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి.శోభామణి మాట్లాడుతూ శిక్షణతో పొందిన పరిజ్ఞానంతో సీమపందుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. సీసీవీఈసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుజాతతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. డాక్టర్ ఎం.కళ్యాణ చక్రవర్తి, డాక్టర్ జి.విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్‌కు స్థలం కేటాయించాలని వినతి


ఎంపీడీవోతో మాట్లాడుతున్న సర్పంచులు

తిరుపతి రూరల్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి సేకరిస్తున్న చెత్తని డంపింగ్ చేసేందుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని ఎంపీడీవో రామచంద్రకు విన్నవించారు. ఈ సందర్భంగా సాయినగర్,లింగేశ్వరనగర్ సర్పంచులు డీపీ రమణ, ముసుగు కోటేశ్వరరావులు మాట్లాడుతూ పంచాయతీల్లో వాహనాలతో సేకరించే చెత్తని డంపింగ్ చేసేందుకు స్థలం లేకుండా ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించాలని కోరారు. పరిశీలించి చర్యలు చేపడుతామని ఎంపీడీవో తెలిపారు. ఎం.శివకుమార్ పాల్గొన్నారు.

లక్ష్యం రూ.9600 కోట్లు..

ఇప్పటికే 5700 కోట్ల వసూలు

● సెంట్రల్ సేల్స్ ట్యాక్స్ అధికారుల వెల్లడి

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి కమిషనరేట్ పరిధిలో ఈ ఏడాది సెంట్రల్ సేల్స్ ట్యాక్స్ వసూళ్ల లక్ష్యం రూ.9600 కోట్లు. ఇప్పటికే రూ.5700 కోట్లను వసూలు చేశారు. గతేడాది రూ.9 వేల కోట్ల లక్ష్యానికిగాను రూ.8800 కోట్లు వసూలు చేసి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈ మేరకు బుధవారం సెంట్రల్ జీఎస్టీ అధికారులు వెల్లడించారు. సెంట్రల్ జీఎస్టీ విధానంలో పన్నులు వసూలు చేసే విధానానికి ఆన్‌లైన్ వ్యవస్థను రూపొందించడంతో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన అన్ని రకాల పన్నుల వసూళ్లు వేగంగా జరుగుతున్నట్లు ఆ శాఖ అధికారి ఒకరు చెప్పారు. సంస్థల రిజిస్ట్రేషన్లు సక్రమంగా చేసాయా లేదా? నిబంధనల మేరకు పన్నులు చెల్లిస్తున్నారా? రిజిస్ట్రేషన్‌లు లేకుండానే ఇన్‌వాయిస్‌లు ఇచ్చి వసూళ్లకు గండి కొడుతున్నారా అనే అంశాలపై తనిఖీలు చేస్తున్నారు.

ఆ విషయాలు చెప్పకూడదు

కాగా, మంగళవారం తిరుపతి సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన సీబీఐ తనిఖీలతో తమకు సంబంధంలేదని కమిషనరు సతీష్ దావ్‌లే చెప్పారు. ఎవరు లంచం తీసుకున్నారు.. ఎవరిని అరెస్టు చేశారనే నే విషయాలు తాము బహిర్గతం చేయకూడదన్నారు. ఏ స్థాయిలో అవినీతి అక్రమాలకు పాల్పడినా దర్యాప్తు సంస్థలు నిఘా ఉంచి చర్యలు తీసుకుంటాయని స్పష్టంచేశారు.


ఒప్పంద పత్రాలతో ఎన్‌బీకేఆర్ డైరెక్టర్, జపాన్ సంస్థ ప్రతినిధులు

ఎన్‌బీకేఆర్‌తో జపాన్ సంస్థ ఒప్పందం

కోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ సంస్థతో సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్య బదలాయింపు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మెడిన్‌షా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయమాతో, డైరెక్టర్ టకాయికి, కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్‌సిమ్హా, నాయుడుపేట మండలం మేనకూరులోని కంపెనీ హెడ్ రమేష్‌చంద్రా సింగ్, హెచ్ఆర్ మేనేజింగ్ చైతన్య, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

అమ్మవారి సేవలో లక్షద్వీప్ లెఫ్టినెంట్ గవర్నర్



తిరుచానూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారిని లక్షద్వీప్ లెఫ్టినెంట్ గవర్నర్(అడ్మినిస్ట్రేటర్) ప్రఫుల్‌పటేల్ దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఏఈవో దేవరాజులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ వేదపండితులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి అమ్మవారి శేషవస్త్రంతో సత్కరించారు.

నాకో ముద్ద.. నీకో ముద్ద



నిద్రలేచింది మొదలు.. రాత్రి పడుకునే వరకు పొట్టకూటి కోసం చేస్తున్న వారి పోరాటంలో తోడునిలిచిన గోమాతతో కలిసి మహిళలు భోజనం చేశారు. ఒక విస్తరి ముందు చిన్న పిల్లల వలే నాకో ముద్ద.. నీకో ముద్ద.. అంటూ గోమాతకు ముద్దలు పెడుతూ తిన్నారు. ఈ దృశ్యం బుధవారం తిరుపతి నగరం కపిలతీర్థం కూడలి సమీపంలో కనిపించింది.

- కపిలతీర్థం, ఆంధ్రజ్యోతి

భూసమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు



అర్జీలను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి రోస్మండ్

భాకరాపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతుల భూసమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని రెవెన్యూ సదస్సుల నియోజకవర్గ ప్రత్యేకాధికారి రోస్మండ్ అన్నారు. చిన్నగొట్టిగల్లు మండలం రంగన్నగారిగడ్డలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. 48 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో తహసీల్దారు జనార్దన్‌రాజు, డీటీ వాసుదేవ కుమార్, ఆర్ఐ జానకీరామ్, సర్వేయర్లు కేశవులు, ఉపసర్పంచ్ కిశోర్ కుమార్ రెడ్డి, మాజీ సర్పంచ్ ఆర్వీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చంద్రగిరి: భూ సమస్యలను పరిష్కరించడం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరామసుబ్బయ్య అన్నారు. చంద్రగిరి మండలంలో బుధవారం భీమవరం, కొండ్రేడ్డికండ్రిగలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు శివరామసుబ్బయ్య మాట్లాడుతూ ప్రజలు భూ సమస్యలపై నిత్యం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని.. ప్రజలు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, మాజీ సర్పంచ్ గుర్రప్పనాయుడు, మాజీ ఎంపీటీసీ హేమాద్రినాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● రామచంద్రాపురం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి అన్నారు. మండలంలోని నడవలూరు, కమ్మకండ్రిగ గ్రామాల్లో తహసీల్దారు వెంకటరమణ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు జనార్దన్ చౌదరి, ఆర్ఐ లక్ష్మీ నారాయణ, వెంకటప్రసాద్, సర్వేయర్ రమేష్‌బాబు, వీఆర్వోలు శ్రీనివాసులు, నరసింహులు, మల్లికార్జున్, పలుశాఖ అధికారులు పాల్గొన్నారు.

● తిరుపతి రూరల్: పైడిపల్లె గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రామాంజులునాయక్ అర్జీలు స్వీకరించారు. మండల సర్వేయర్ హేమకుమార్, ఆర్ఐ రఘువర్మ, వీఆర్వో మురళి, టీడీపీ నేతలు భానుప్రతాప్‌రెడ్డి, బాలయాదవ్, అశోక్‌రెడ్డి, రాందాస్‌యాదవ్ పాల్గొన్నారు.

రుయా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

బస్సు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ


రుయాస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసులు

తిరుపతి (వైద్యం), డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): రుయా ఆస్పత్రి అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఉప్పరపల్లి సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడి రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఆయన బుధవారం పరామర్శించారు. వైద్య సేవలు, సదుపాయాల గురించి బాధితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆస్పత్రిలో శిథిల దశలో ఉన్న పలు వార్డులను, భవనాలను పరిశీలించారు. వాటివల్ల ఎలాంటి ప్రమాదాలూ జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూపరింటెండెంట్ రవిప్రభును ఆదేశించారు. ఆస్పత్రి అవసరాలపై ప్రతిపాదనలు సిద్ధం చేస్తే హెచ్‌డీఎస్ కమిటీలో చర్చించి, పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏఆర్ఎంవో హరికృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు రాజారెడ్డి ఆయన వెంట ఉన్నారు.

నివాస ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడండి


ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): నివాస పరిసరాలలో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిస్ట్రిక్ట్ డిప్యూటీ మాస్ మీడియా ఆఫీసర్స్ కిరణ్‌కుమార్, భానుమూర్తి సూచించారు. సప్తగిరికాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ జయంతి ఆధ్వర్యంలో బుధవారం అంగన్‌వాడీ కేంద్రంలో కుష్ఠు, డెంగీ, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమల నివారణ, నీటి కాలుష్యాన్ని అరికట్టడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. దోమల ఉత్పత్తి జరగకుండా ప్రతి శుక్రవారమూ డ్రైడే నిర్వహించాలని వైద్యులను ఆదేశించారు. కుష్ఠువ్యాధి వంశపారంపర్యంగా వచ్చేది కాదని, స్పర్శలేని మచ్చలు, లావుగా మారి నొప్పితో కూడిన నరాలు, చెవి మందంగా మారి ఉండడం తదితర లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని అన్నారు. నీరు కలుషితం కాకుండా చూడాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు.

కరాటేలో తిరుపతి బాలుడి సత్తా


కరాటే క్రీడాకారుడిని అభినందిస్తున్న స్కూల్ అధికారులు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో గత మంగళవారం జరిగిన అంతర్జాతీయ గొజు-రియు కరాటే పోటీలలో తిరుపతి బాలుడు సి.ప్రణీత్‌రెడ్డి సత్తాచాటాడు. కపిల తీర్థం సమీపంలోని నారాయణ విద్యా సంస్థల్లో చదువుతున్న ప్రణీత్‌రెడ్డి రెండు విభాగాలలో అత్యుత్తమంగా రాణించి కట ఫస్ట్ క్యాటగిరిలో స్వర్ణపతకం, కుమితే సెకండ్ క్యాటగిరిలో వెండి పతకం కైవసం చేసుకున్నాడు. బాలుడిని పాఠశాల డీజీఎం కొండల రావు, ఏజీఎం శ్రీనివాసులు, ఆర్ఐ వసంత్, ప్రిన్సిపాల్ సుధాకర్‌నాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

21న జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మైదానంలో ఈ నెల 21వ తేదీన జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 16 బాలబాలికలు 2 కిలోమీటర్లు, అండర్ 18 బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్లు, అండర్ 20 బాలురకు 8 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీటర్లు, 20 ఏళ్ల పైబడిన పురుషులకు, స్త్రీలకు 10 కిలోమీటర్లు పరుగు పోటీలు జరుగుతాయని వివరించారు. రాణించిన క్రీడాకారులు ఈనెల 28న వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. మరిన్ని వివరాలకు 8686867079ను సంప్రదించాలని కోరారు.

పబ్ కల్చర్‌పై సమాధానం చెప్పాలి : వైసీపీ


మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి(జీవకోన), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఓ రెస్టారెంట్‌లో పబ్ కల్చర్, డీజే సౌండ్స్, అసభ్యకర ప్రవర్తనలు, మాదకద్రవ్యాలు వాడుతున్నట్లు ఆరోపణలు రావడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని వైసీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రెస్టారెంట్ కూటమి ప్రభుత్వానికి అనుకూలమైన వారిది కావడంతోనే దానిపై నిఘా లేకుండా పోయిందన్నారు. ఈ ఘటనపై విచారణ జరగాలని కోరారు. ఉదయం ఏడు నుంచి రాత్రి 12 గంటల వరకు మద్యం విక్రయాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో మేయర్ శిరీష, వైసీపీ నేతలు అజయ్ కుమార్, బొమ్మగుంట రవి పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాప్ చైర్మన్ రవినాయుడు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 27వ ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్(2024-25) శుక్ర, శనివారాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం శాప్ చైర్మన్ ఎ.రవినాయుడు దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 13 జిల్లాల నుంచి 350మందికిపైగా బాలురు ఈ పోటీలలో పాల్గొంటున్నారు. ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, హెడ్ ఆఫ్ ఫార్మసీ జి.కృష్ణమూర్తినాయుడు, కాలేజీ పీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన స్త్రీనిధి ఎండీ



తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెంకటేశ్వర్‌ను బుధవారం రాష్ట్ర స్త్రీనిధి ఎండీ జీవీబీడీ ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఎంఎస్ఎంఈ కార్యక్రమాలకు స్త్రీనిధి నుంచి ఆర్థిక సహకారం అందిస్తామని ఆయన తెలిపారు. అనంతరం జిల్లా స్త్రీనిధి ప్రగతిపై కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, ఏజీఎం హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

అభ్యుదయ సాహిత్యానికి దక్కిన గౌరవం

దీపిక పుస్తకానికి సాహిత్య అకాడమీ అవార్డుపై అరసం హర్షం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ లక్ష్మీనారాయణ రాసిన దీపిక పుస్తకం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డుకు ఎంపిక కావడం పట్ల అరసం హర్షం వ్యక్తం చేసింది. సమాజ చైతన్యానికి సాహిత్యం ద్వారా కృషి చేస్తున్న పెనుగొండ లక్ష్మీనారాయణకు ఈ అవార్డు రావడం అభ్యుదయ సాహిత్యానికి దక్కిన గౌరవంగా వారు అభివర్ణించారు. లక్ష్మీనారాయణను అరసం రాష్ట్ర అధ్యక్షవర్గ సభ్యులు సాకం నాగరాజ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యువశ్రీ మురళి, నెమిలేటి కిట్టన్న, పేరూరు బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

20న వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20వ తేదీన వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. జిల్లా వినియోగదారుల సంఘం పోటీలు చేపట్టనుంది. తెలుగు, ఇంగ్లిషు భాషల్లో డిగ్రీ స్థాయి విద్యార్థుల కోసం పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు మొదటి స్థానానికి రూ.3 వేలు, రెండో స్థానానికి రూ.2 వేలు, మూడవ స్థానానికి రూ.1500 అందజేస్తారు. సమగ్ర వివరాల కోసం.. 9393620006లో సంప్రదించాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి రాజారెడ్డి కోరారు.

పద్మావతి వర్సిటీలో డీన్లు, విభాగాధిపతుల నియామకం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో పలు కీలక పదవులను భర్తీ చేశారు. సైన్స్ డీన్‌గా కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ సుధ, డెవెలప్‌మెంట్ డీన్‌గా ఇంగ్లిషు ప్రొఫెసర్ తుమ్మపూడి భారతి, సెంట్రల్ లైబ్రరీ డైరెక్టర్‌గా ఇంగ్లిషు ప్రొఫెసర్ శారదను నియమించారు. అలాగే వర్సిటీ బయో టెక్నాలజీ హెడ్‌గా ప్రొఫెసర్ జాన్ సుష్మా, సెరికల్చర్ హెడ్‌గా ప్రొఫెసర్ విజయకుమారి, ఎడ్యుకేషన్ హెడ్‌గా ప్రొఫెసర్ రేణుకను నియమించారు.



బస్సులను శుభ్రం చేసే స్థలంలో చెత్తకుండీలు, వ్యర్థాల కుప్పలు - డ్రైవింగ్‌స్కూల్ వెనుక ఉన్న శిథిలమైన ఆటోలు

అపరిశుభ్రతకు మారుపేరు అలిపిరి డిపో

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ అలిపిరి డిపో అశుభ్రతకు మారుపేరుగా కనిపిస్తోంది. ఎటుచూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. బస్సులను నీటితో శుభ్రం చేసే కేంద్రం వద్ద చెత్తకుండీలు, వ్యర్థాల కుప్పలు, గ్యారేజీకి సమీపంలోనే నిరుపయోగంగా పడివున్న బస్సు టైర్లు, డ్రైవింగ్ స్కూల్ వెనుక తుప్పుపట్టిన ఆటోలు, తినిపడేసిన ఆహారవ్యర్థాలు, పాడైన బస్సుసీట్లు, ప్లాస్టిక్ వాటర్ బాటిళ్ల బస్తాలు, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు, వృథా గ్యారేజీ వస్తువులు ఎక్కడపడితే అక్కడ చిందర వందరగా పడివున్నాయి. దీంతో డిపోలోకి ప్రవేశించగానే దుర్వాసన వస్తోంది. వ్యర్థాలు పోగవడం వల్ల అగ్నిప్రమాదం జరిగే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు తగినచర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.


పాడైన బస్సు సీట్లు


సిబ్బంది వినియోగించిన ప్లాస్టిక్ బాటిళ్ల మూటలు

ప్రభుత్వ వసతి గృహాల్లో మరమ్మతులు వేగవంతం చేయండి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు. అధికారులు ఈ పనులను పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి చెన్నయ్య పాల్గొన్నారు.

దళితులు ఐక్యంగా ఉండాలి


సంఘీభావం తెలుపుతున్న దళిత సంఘాల నేతలు

తిరుపతి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మాలమాదిగలు అన్నదమ్ముల్లా కలిసి ఉండాలని దళిత సంఘాల నాయకులు కోరారు. బుధవారం స్థానిక ఓ ప్రైవేటు హోటల్లో మాలల జేఏసీ ఆధ్వర్యంలో రాయలసీమ మాల మహా గర్జన సన్నాహక సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల మాలమాదిగలు అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉన్నారని, అయితే వర్గీకరణ అంశం రావడం బాధాకరమని అన్నారు. త్వరలో తిరుపతి వేదికగా జరగనున్న మాలమహాగర్జనలో అందరూ అభిప్రాయాలను వినిపించాలని కోరారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు వై.ప్రవీణ్, సుదర్శన్, ప్రభాకర్, అజయ్‌కుమార్, ధనశేఖర్, గోపి, చిరంజీవి, స్వర్ణ, వెంకయ్య పాల్గొన్నారు.

వేదవిజ్ఞాన వ్యాప్తికి టీటీడీ కృషి


అధికారులతో సమీక్షిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు టీటీడీ అవిరళ కృషి చేస్తోందని ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. వేద విశ్వవిద్యాలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. 2006లో వేద విశ్వవిద్యాలయాన్ని టీటీడీ ఏర్పాటు చేసిందని, అప్పటి నుంచి వేద విద్య బోధన, పరిశోధన, విస్తరణకు కృషి చేస్తోందని చెప్పారు. త్రికోణమితి, గణిత, ఖగోళ శాస్త్ర విషయాలు వేదాల్లో ఉన్నాయని, ఈ విషయాలను సాధారణ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఐఐటీ సహకారంతో వేదసారాన్ని ఈ తరానికి అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం వేదవిశ్వవిద్యాలయంలోని క్లాస్ రూములు, హాస్టళ్లు, రికార్డింగ్ స్టూడియో, తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు. వేద వాఙ్మయానికి చెందిన శుక్ల యజుర్వేద వాజసణీయ ప్రాది సాఖ్యము, సేవది పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, జేఈవో గౌతమి, రిజిస్ట్రార్ రాధాగోవింద త్రిపాఠి పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

తిరుపతి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, క్లస్టర్ ఇన్‌చార్జ్ జేబీ శ్రీనివాస్ పుట్టిన రోజును పురస్కరించుకుని ఆయన అభిమానులు అన్నదానం, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వేస్టేషన్, గాంధీరోడ్డు, కృష్ణాపురం ఠానా, రుయాస్పత్రి, లీలామహల్, మున్సిపల్ ఆఫీస్, కొర్లగుంట, బైరాగిపట్టెడ, మామిడికాయల మండి ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేశారు. నవజీవన్, అక్షయక్షేత్రంలో పలు రకాల ఆహార పదార్థాలు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేబీ రమణ, మహేష్‌యాదవ్, రఘురాం, ఖాలేశా పాల్గొన్నారు.

వేద సంస్కృతి పరిరక్షణకు పనిచేయండి


కంచి పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి (ఉపాధ్యాయ నగర్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేద సంస్కృతి, హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలని కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి టీటీడీ ధర్మకర్తల మండల సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డికి ఉపదేశించారు. బుధవారం విజయేంద్ర సరస్వతి తన శిష్య బృందంతో కలిసి తిరుపతి శాంతి నగరంలోని భానుప్రకాష్‌రెడ్డి స్వగృహాన్ని సందర్శించారు. భానుప్రకాష్‌రెడ్డి పీఠాధిపతికి స్వాగతం పలికి, కుటుంబ సభ్యులతో కలిసి పాదపూజ చేశారు. విజయేంద్ర మాట్లాడుతూ ప్రస్తుత టీటీడీ ధర్మకర్తల మండలి ధర్మ పరిరక్షణకు, తిరుమల, శ్రీవారి ప్రతిష్ఠను ఇనుమడింపజేయడానికి మరింతగా పనిచేయాలని కోరారు.

తిరుమల బైపాస్ రోడ్డులో మురుగు నీటి ప్రవాహం


రోడ్డుపై జోరుగా ప్రవహిస్తున్న డ్రైనేజీ నీరు



తిరుపతి అర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : తిరుమల బైపాస్ రోడ్డులోని కొర్లగుంట జంక్షన్ వద్ద డ్రైనేజీ నీరు రోడ్డుపై జోరుగా ప్రవహిస్తోంది. ఆ ప్రాంతంలో ఇటీవల నూతన నిర్మాణాలు చేపడుతుండడంతో సైడుకాలువ పూడిపోయింది. ఈ క్రమంలో ఎగువ నుంచి వచ్చే డ్రైనేజీ నీరు రోడ్డుపైకి వ్యాపించి దారిపొడవునా దుర్గంధం వెదజల్లుతున్నాయి. ఆ మార్గంలో వెళ్లేవారు మురుగునీటిని తొక్కుకుండా నడవాల్సి వస్తోంది. పిల్లలు, ఉద్యోగులు ముక్కులు మూసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దుకాణదారులు దుర్వాసన భరించలేక అవస్థ పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

శ్మశాన స్థల సమస్య పరిష్కరించండి

మంగళం, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిమ్మినాయుడుపాళెం శ్మశానవాటిక సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి వివేక్‌ను ఆదేశించారు. వివేక్ బుధవారం తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తిమ్మినాయుడుపాళెం శ్మశానవాటిక స్థలానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం భూమి ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దివ్యారామం పార్క్‌ను అభివృద్ధి చేయాలని కోరారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం తిరుపతిలో చోటుచేసుకుంది. రైల్వే ఏఎస్ఐ రమణ కథనం మేరకు... తిరుపతి-తిరుచానూరు స్టేషన్ల మధ్యలోని రైల్వే ట్రాక్ వద్ద మధ్యాహ్నం రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలూ లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. వివరాలు తెలిసిన వారు 9440627638కు సమాచారం ఇవ్వాలని కోరారు.

జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ



తిరుపతిఅర్బన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ముద్రించిన 2025 క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆవిష్కరించారు. కొత్త ఏడాది ప్రజలందరూ ఆయురారోగ్యాలతో కలిసిమెలసి ఉండాలని ఆకాంక్షించారు. ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, సుధాకర్, ప్రభాకర్ రెడ్డి, హేమంత్‌కుమార్, రుద్రకిషోర్, మధుశ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థశి వేడుకలు


ప్రత్యేకాలంకరణలో స్వామి

తిరుపతి(జీవకోన), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వినాయకసాగర్ వద్ద ఉన్న సంకల్ప వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో బుధవారం సంకటహర చతుర్థశి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ పురోహితుడు సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీవో పోలీస్ ఈ చలానాలు రద్దు చేయాలి

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఆటోమోటార్ వాహనాలపై పెండింగ్‌లో ఉన్న ఆర్టీవో పోలీస్ ఈ చలానాలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రుయాస్పత్రిలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుకు వినతిపత్రం ఇచ్చారు. మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆటో కార్మికుల జీవితాలు దుర్భరంగా మారే విధంగా తీసుకొచ్చిన జీవో 21, 31లను రద్దు చేయాలని కోరారు. ఆటో కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లతో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బ్యాడ్జి ఉన్న ప్రతి ట్రక్ డ్రైవర్‌కూ రూ.15 వేలు ఇస్తామని, థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ కల్పిస్తామని ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, ఎన్.డి.రవి, ఎం.శివ, మహేంద్ర పాల్గొన్నారు.

పేరూరులో రౌడీషీటర్ల హల్‌చల్


తలుపును కాళ్లతో తంతున్న నిందితుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరులో టీడీపీ వార్డు మెంబరు ఇంటిపై దాడి చేసిన ఇద్దరు రౌడీషీటర్లపై పోలీసులు కేసు నమోదు చేశారు. రూరల్ ఎస్ఐ రామకృష్ణ కథనం మేరకు...పేరూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన జ్ఞానేశ్వర రెడ్డి, అతని బావమరది ప్రవీణ్ రెడ్డి రౌడీ షీటర్లు. మంగళవారం రాత్రి టీడీపీ వార్డు మెంబరు కంకి మంజు ఇంటిపై దాడి చేశారు. మంజు ఎంత నచ్చజెప్పినా వినకుండా మద్యం మైకంలో కేకలు వేస్తూ, తలుపులను తంతూ భయభ్రాంతులకు గురిచేశారు. సీసీ కెమెరాలను ఆఫ్ చేశారు. చివరకు చుట్టుపక్కల వారు నచ్చజెప్పి పంపారు. వార్డు మెంబరు భార్య కంకి లక్ష్మి బుధవారం రాత్రి తిరుపతి రూరల్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రౌడీషీటర్ల అనుచరుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

ప్రయాణికుడికి ల్యాప్‌టాప్ అప్పగింత


ల్యాప్‌టాప్‌ను అప్పగిస్తున్న డ్రైవర్

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన ల్యాప్‌టాప్‌ను తిరిగి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రం కామారెడ్డి పట్టణానికి చెందిన బి.రామకృష్ణ బుధవారం ఆర్టీసీ బస్సులో శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వచ్చాడు. బస్సు దిగే హడావిడిలో పక్కనపెట్టిన ల్యాప్‌టాప్‌ను మరచి వెళ్లిపోయాడు. కొంతసేపటికి డ్రైవర్ శ్రీనివాసులు గుర్తించి, స్వాధీనం చేసుకున్నాడు. సీటీఎం విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లాడు. బ్యాగులో ఉన్న ఆధారాలతో ప్రయాణికుడికి ఫోన్ ద్వారా తెలియజేశాడు. డీపీటీవో జగదీష్ సమక్షంలో బ్యాగుతో పాటు విలువైన ల్యాప్‌టాప్‌ను అందజేశారు.

■ అద్భుత క్షేత్రం తిరుమల



● విద్యాశంకర భారతీస్వామి

ఈ బ్రహ్మాండంలో అద్భుతమైన క్షేత్రం తిరుమల అని పుష్పగిరి శంకరాచార్య మఠాధిపతి విద్యాశంకర భారతీస్వామి అన్నారు. బుధవారం నైవేద్య విరామ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. 'రామరాజ్యం వచ్చి ప్రజలందరూ ఆనందంగా ఉండాలి. లోకాన్ని రక్షించాలి. జనాల్లో సద్బుద్ధి, ధార్మిక చింతన కలగాలి' అని స్వామిని కోరుకున్నానని చెప్పారు. స్వామి మహత్మ్యం కనిపిస్తే తద్వారా హైందవ లోకంలో సుఖసంతోషాలు కలుగుతాయన్నారు. ఆలయం వద్ద భారతీస్వామికి అర్చకబృందం, టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఇస్తికఫాల్ స్వాగతం పలికారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

■ పెద్దజీయర్‌స్వామికి పెద్ద మర్యాద



అమ్మవారి ఆలయం వద్ద పెద్దజీయర్‌స్వామి

పెరియ కోయిల్ కెల్వియప్పన్ శఠగోప రామానుజ పెద్దజీయర్‌స్వామికి బుధవారం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం.. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలో పెద్దమర్యాద జరిగింది. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం ఆయన అమ్మవారు, గోవిందరాజస్వామి మూలవర్లను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేసి సత్కరించారు. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవద్ రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో పెద్దజీయర్ మఠం ఏర్పాటైంది. శ్రీవారి ఆలయం, పద్మావతి అమ్మవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాల్లో కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలను ఇప్పటికీ పెద్దజీయర్ పర్యవేక్షిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్‌వో సతీష్‌కుమార్ అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుభాస్కర్‌నాయుడు, సుబ్బరాయుడు.. టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీపీఆ బాలాజీ, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, శాంతి, నాగరత్నం, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- తిరుచానూరు/తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి



సర్వదర్శనానికి 15 గంటలు

తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 27 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

సోమవారం నాటి హుండీ ఆదాయం: రూ.3.59 కోట్లు

మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 63,598

తలనీలాలు సమర్పించిన వారు: 20,102



చలిగాలులు...

పాటించాలి జాగ్రత్తలు

తుపాను వాతావరణంతో చలిగాలులు విపరీతంగా పెరిగిపోయాయి. సూర్యుడి జాడ పెద్దగా కనిపించడడం లేదు. కనిపించినా ఎండ పడడం లేదు.ఈ వాతావరణం కొత్త అనారోగ్యాలకు దారి తీస్తోంది. జలుబు, దగ్గు, జ్వరాలతో జనం ఆసుపత్రులకు బారులు తీరుతున్నారు. ఇప్పటికే కురిసిన వానలకు కుంటలన్నీ నిండిపోయి దోమల వృద్ధి కేంద్రాలుగా మారాయి. వృద్ధులు, పిల్లలు శ్వాసకోస సమస్యలతో సతమతం అవుతున్నారు. ఇటువంటి కాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

పిల్లలు జాగ్రత్త





చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండటం వలన జలుబు, దగ్గు, జ్వరాలు బారిన శీతాకాలంలో ఎక్కువగా పడుతారు. జలుబు తీవ్రత వల్ల ఊపిరి పీల్చుకునేందుకు కూడా ఇబ్బంది పడతారు. నిద్ర పట్టదు. ఇలాంటి పరిస్థితుల్లో చిన్నారులను వీలైనంత వరకు బయట చల్లగాలులకు తీసుకు వెళ్లకూడదు. ఉన్ని, ఒదులుగా ఉండే దుస్తులను పిల్లలకు వేయడంతోపాటు చెవుల్లో గాలిపోకుండా తగు జాగ్రత్తలు పాటించాలి. ఆహారం, నీళ్లు, వెచ్చగా ఉండాలి. కూల్‌డ్రింక్స్‌కి, స్వీట్లుకి దూరం పెట్టాలి. నెలల బిడ్డల విషయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించడం మేలు.

- డాక్టర్ మనోహర్, చిన్నపిల్లల విభాగాధిపతి, రుయా



బాలింతలూ.. ఇవి పాటించండి!



చలికాలంలో బాలింతలు చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మంచు, చలిగాలులలోకి రాకూడదు. బయటకు రావలసివస్తే చెవుల్లోకి గాలిపోకుండా చూసుకోవాలి. వానకు తడిస్తే వెంటనే బట్టలు మార్చుకోవాలి. పోషక విలువలున్న ఆహారమే తీసుకోవాలి. అదీ వేడిగా ఉండేలా చూసుకోవాలి. కాన్పు తర్వాత కనీసం అయిదు నెలలపాటు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. వారు ఆరోగ్యంగా ఉంటేనే, వారి చిన్నారులూ ఆరోగ్యంగా ఉంటారు.

-డాక్టర్ పార్థసారథిరెడ్డి, తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్

వృద్ధుల కోసం రుయాలో ప్రత్యేక ఓపీ కౌంటర్లు



చలికాలం, వానాకాలం .. వృద్ధులే అనేక ఆరోగ్య సమస్యల బారిన పడతారు. రుయాలో వృద్ధుల కోసం ప్రత్యేక ఓపీ కేంద్రాలను అందుబాటులో ఉంచాం. ఓపీకి వస్తున్న వారిలో 50 ఏళ్లు పైబడిన వారే ఎక్కువ. జలుబు, దగ్గు, జ్వరాలు వంటి జబ్బులతో, శ్వాసకోస సమస్యలతోనే వీరు వస్తున్నారు. ఆసుపత్రికి వచ్చే వృద్ధులకు సాయంగా ఇద్దరు అటెండర్లు ఉంటే మంచిది.

-డాక్టర్ రవిప్రభు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్



రుయాస్పత్రిలో వైద్యం కోసం వృద్ధుల క్యూ

గ్రామీణులూ.. ఆరోగ్యం భద్రం



వారం రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రత్తలు తగ్గి వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉండటం వలన తగిన ఆరోగ్య జగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లోని పీహెచ్‌సీ వైద్యులు, వైద్య సిబ్బందితోపాటు క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది నిరంతరం ప్రజలను అప్రమత్తం చేస్తూ వారి ఆరోగ్య విషయంలో తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశాము. అవసరమైన చోట వెంటనే వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తాం.

-డాక్టర్ శ్రీహరి, జిల్లా వైద్య ఆరోగ్యశాకాధికారి







ఆపత్కాలంలో ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు ఎనలేనివి





ఎన్‌సీసీ క్యాడెట్లతో మంత్రి రాంప్రసాద్ రెడ్డి

● యువజన, క్రీడలశాఖామంత్రి రాంప్రసాద్‌రెడ్డి

తిరుపతిరూరల్, డిసెంబరు18 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆపత్కాల పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌సీసీ క్యాడెట్లు అందిస్తున్న సేవలు ఎనలేనివని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. యువతలో ఐక్యత, క్రమశిక్షణ పెంపొందించడంలో ఎన్‌సీసీ కీలకపాత్ర పోషిస్తోందన్నారు. తిరుపతి నగరం ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని (2ఏ)ఆర్‌అండ్‌వీ రెజిట్ ఎన్‌సీసీ కార్యాలయంలో బుధవారం రక్తదాన శిబిరాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడారు. విజయవాడ వరదల సమయంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ఎన్‌సీసీ విద్యార్థులు ఎంతో శ్రమించారని గుర్తుచేశారు. లెఫ్టినెంట్ కల్నల్ అనుప్, కల్నల్ సతీందర్ దహియా, వెటర్నరీఇన్‌చార్జి వీసీ డాక్టర్ జేవీరమణ, అధికారులు, ఎన్‌సీసీ యూనిట్ల ఆర్మీసిబ్బంది, సివిల్‌సిబ్బంది, క్యాడెట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 75మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మెజెస్టిక్ ఆర్మీ గుర్రంపై క్యాడెట్లు దూకడం.. ఆర్మీగుర్రాలు గుడ్‌లక్, రోమన్‌ఫామ్, గగన్, రాణిపై జంపింగ్ విన్యాసాలు.. ఒకచేత్తో ఈటెతో దూసుకుపోతూ మరోచేత్తో గుర్రాన్ని అదుపు చేస్తూ చేసిన టెంట్ పెగ్గింగ్ ప్రదర్శన.. ఫైర్‌జంప్ వంటి గుర్రపుస్వారీలను క్యాడెట్లు ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు

గూడూరు అర్బన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. గూడూరు రెండో పట్టణ సీఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం.. గూడూరు పట్టణం మాళవ్యానగర్ ప్రాంతానికి చెందిన జనార్దన్ చిల్లర దుకాణం నిర్వహించేవాడు. 2020 సెప్టెంబరులో పదకొండేళ్ల బాలిక సరుకులు కొనేందుకు దుకాణానికి రాగా అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై బాలిక తల్లి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో బుధవారం నెల్లూరులోని పోక్సో కోర్టు న్యాయమూర్తి నిందితుడు జనార్దన్‌కు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.20 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారని సీఐ తెలిపారు.

శ్రీవారి సేవలో క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్



తిరుమల, డిసెంబరు18(ఆంధ్రజ్యోతి): టీంఇండియా మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వైకుంఠం క్యూకాంప్లెక్స్ నుంచి ఆలయంలోకి వెళ్లిన ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం చేయించి లడ్డూప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల వీరేంద్ర సెహ్వాగ్‌తో సెల్ఫీలు తీసుకునేందుకు భక్తులు ఎగబడ్డారు.

47 రెవెన్యూ సభలు.. 699 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం 47 రెవెన్యూ గ్రామసభలను నిర్వహించగా, 699 అర్జీలు అందాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. ఇళ్ల స్థలాలు 55, అసైన్‌మెంట్ భూమిపై 53, క్యాస్ట్ వెరిఫికేషన్ 15, రీసర్వే 36, భూ ఆక్రమణలు 2, ఆర్‌వోఆర్‌పై 370, ఇతర విషయాలకు సంబంధించి 148 చొప్పున 699 అర్జీలు వచ్చాయన్నారు. అప్పటికప్పుడే 15 సమస్యలను పరిష్కరింగా.. మిగిలిన వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరించాలన్నారు. ఇప్పటి వరకు 8,003 ఫిర్యాదులు అందినట్లు వివరించారు.

హత్యకేసులో ముగ్గురి అరెస్టు



నిందితుల అరెస్టు చూపుతున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి చెప్పారు. ఈ వివరాలను బుధవారం ఆయన శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మీడియాకు వివరించారు. 'అన్నమయ్య జిల్లా పుల్లంపేటకు చెందిన ఎలక్ట్రీషియన్ ప్రభాకర్ అదృశ్యంపై వన్‌టౌన్ సీఐ గోపి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏర్పేడు మండలం పల్లంగొల్లపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్ ముగ్గురు కలిసి అతడిని హత్య చేసినట్లు విచారణలో గుర్తించారు. మంగళవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేయించారు. ఈ హత్యకేసులో నిందితులైన వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, హేమంత్‌కుమార్‌ను బుధవారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు' అని డీఎస్పీ వివరించారు ఈ కేసును చేధించిన సీఐ గోపి, ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి, కానిస్టేబుళ్లు హేమాద్రి, శంకర్, బాలచంద్ర, గంగాధర్, ప్రసాద్, రవిచంద్ర, సుందరంను ఆయన అభినందించారు.

అయ్యో.. తల్లి..!

● ఆస్పత్రికి తీసుకొచ్చి ఓపీ తెస్తానంటూ పరారైన సహాయకుడు
● రుయా ముందు దీనస్థితిలో వృద్ధురాలు



చేతి గాయానికి కట్టు. నడవలేని స్థితి. నోటిమాట సరిగా రాలేదు. దీనస్థితిలో ఉన్న ఈ 70 ఏళ్ల వృద్ధురాలిని బుధవారం తిరుపతిలోని రుయాస్పత్రిలో వదిలేశారు. ఈమెను ఉదయం ఓ వ్యక్తి ఆటోలో రుయా అత్యవసర విభాగానికి తీసుకొచ్చాడు. అక్కడ వైద్య సిబ్బందికి ఆమె కుమారుడినని చెప్పాడు. ఓపీ తెమ్మంటే.. తెస్తానంటూ వెళ్లిన వాడు మళ్లీ రాలేదు. అత్యవసర విభాగంలోని వైద్యులు ఆమెను పరీక్షించగా.. చేతికి తీవ్ర గాయాలున్నట్లు గుర్తించారు. మందు రాసి కట్టుకట్టారు. ఆమె వెంట వచ్చిన వ్యక్తి కోసం సిబ్బంది విచారించారు. ఎవరూ లేకపోవడంతో మధ్యాహ్నం వరకు అత్యవసర విభాగంలో ఉంచి అనంతరం బయటకు పంపేశారు. నడవలేని స్థితిలో ఉన్న ఆ తల్లి.. అత్యవసర విభాగం ముందు ఓ చెట్టు కింద నిస్సహాయంగా కూలబడ్డారు. చలికి వణుకుతూ.. చిన్నపాటి చినుకులకు తడుస్తూ తనవారికోసం నిరీక్షిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది, స్థానికులు నిన్ను ఎవరు తీసుకొచ్చారని అడిగితే.. నా కొడుకు అనే సమాధానం తప్ప ఇంకేమీ చెప్పలేదు. చెప్పేందుకూ ఇష్టపడలేదు. పదే పదే అడిగితే నన్ను ఇలాగే వదిలేయండి అంటూ చెమ్మగిల్లిన కన్నీళ్లతో ప్రాధేయపడ్డారామె. ఆమె పరిస్థితికి చలించిన సెక్యూరిటీ సిబ్బంది.. చిన్నపాటి దుప్పటి, నీరు, కొంచెం ఆహారం అందించారు.

- తిరుపతి(వైద్యం), ఆంధ్రజ్యోతి

16.5 కిలోల గంజాయి స్వాధీనం

● ఐదుగురి అరెస్టు

భాకరాపేట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): గంజాయి స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్టు చేసినట్లు భాకరాపేట సీఐ ఇమ్రాన్ బాషా తెలిపారు. ఒడిశా నుంచి గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారంతో బస్టాండులో నిఘా పెట్టామన్నారు. తలకోన వైపు వెళ్లడానికి అనుమానాస్పదంగా తిరుగుతున్న తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన జాఫర్ బిలాల్, తమిళసెల్వం, రాజాదొరై, కర్ణాటక రాష్ట్రం దావణగెరెకు చెందిన ఇస్మాయిల్, రఫీక్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వారి నుంచి రూ.2.3 లక్షల విలువైన 16.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి ఐదుగురు నిందితులను రిమాండుకు పంపామన్నారు.

ఈవీఎం గోదాముల వద్ద పటిష్ఠ భద్రత



రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఈవీఎం గోదాముల వద్ద నిరంతరం పటిష్ఠ భద్రత ఉండేలా చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వెంకటేశ్వర్ తెలిపారు. రేణిగుంట విమానాశ్రయ సమీపంలో ఈవీఎంలను భద్రపరచిన సెంట్రల్ వేర్ హౌసింగ్ గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. పోలింగ్ రోజున మొరాయించిన 66 ఈవీఎంలను భెల్ కంపెనీకి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఈవీఎం గోదాముల ఇన్‌చార్జి సుధారాణి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ప్రసాద్, తహసీల్దారు సురేష్‌బాబు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి లా స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీ నిర్వహించే వివిధ లా కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈనెల 21వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నారు. 27వ తేదీ దాకా అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగనుంది. లాసెట్ ఉత్తీర్ణులైన విద్యార్థినులు అర్హులు. మూడు, ఐదేళ్ల డిగ్రీ కోర్సులతో పాటు రెండేళ్ల పీజీ కోర్సుల్లో సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. వీటి భర్తీకి ఈ అడ్మిషన్లు చేపడుతున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో లా విభాగంలో సంప్రదించవచ్చునని పీఆర్వో శ్రీరజని తెలిపారు.

సత్ఫలితాలిస్తున్న 'మొబైల్ హంట్'

● రూ.87 లక్షల విలువ చేసే 435 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను పరిశీలిస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'మొబైల్ హంట్' సేవలు సత్ఫలితాలిస్తున్నట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. తిరుపతిలోని ఎస్పీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రూ.87 లక్షల విలువ చేసే 435 సెల్‌ఫోన్లను రికవరీ చేశామన్నారు. ఇప్పటివరకు 11 విడతల్లో 3840 సెల్ ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామని వివరించారు. ప్రస్తుతం 12వ విడతలో నెల రోజుల వ్యవధిలో 435 సెల్‌ఫోన్లు రికవరీ చేసి బాధితులకు ఇచ్చామన్నారు. సెల్‌ఫోన్ల రికవరీలో రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. సైబర్ క్రైం పోలీసుల పనితీరు వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఎవరైనా తమ మొబైల్ ఫోను పోగొట్టుకున్నా.. చోరీకి గురైనా వెంటనే మొబైల్ హంట్ నెంబరు 94906 17873 కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ చేయాలన్నారు. దీనికి వచ్చే లింకులో వివరాలు నమోదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. అపరిచితులు విక్రయించే సెల్‌ఫోన్లను ఎవరూ కొనొద్దని సూచించారు. ప్రస్తుతం ఈ సెల్‌ఫోన్లను కేరళ, ఏపీ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి రికవరీ చేశామని తెలిపారు. ఈ రికవరీలో ప్రతిభ చూపిన సైబర్ క్రైం సీఐ వినోద్‌కుమార్, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, ల్యాబ్ సీఐ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు వెబ్‌సైట్ ప్రారంభం

ప్రజలకు సత్వరమే పోలీసు సేవలు అందుబాటులో ఉండేలా ఎస్పీ సుబ్బరాయుడు బుధవారం 'జిల్లా పోలీసు వెబ్‌సైట్'ను ప్రారంభించారు. ఇకపై పారదర్శకత, జవాబుదారీతనం, పౌర స్నేహపూర్వక పోలీసింగ్ విధానం అలవాటు అవుతుందన్నారు. జిల్లా పోలీసులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ వెంకట్రావు, జాయింట్ డైరెక్టర్ ఐటీ కోర్ టీకే సుధాకర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాలు

తిరుపతి(ఆర్టీసీ), ఆంధ్రజ్యోతి : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ మసోత్సవాలు ఈనెల 20 నుంచి జనవరి 19వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీపీటీవో జగదీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని డిపో మేనేజర్ల పరిధిలో 5,889 డోర్ డెలివరీలు చేయాల్సి ఉందని వెల్లడించారు.

టీడీపీ కార్యకర్తకు ఎమ్మెల్యే నివాళి



సుభాష్ చంద్ర మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల, మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి

డక్కిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలం వెంపటివారిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త శునకం సుభాష్ చంద్ర(32) బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. ఇటీవల పొలంలో పనిచేస్తుండగా స్పృహ తప్పి పడిపోవడంతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి చెన్నైకు తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మళ్లీ తిరుపతికి తీసుకొచ్చారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. విషయం తెలిసిన వెంటనే వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంపటివారిపల్లి గ్రామానికి చేరుకొని సుభాష్ చంద్ర మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అన్ని విధాలా ఆదుకొంటామని భరోసా ఇచ్చారు. సుభాష్ చంద్ర పార్టీలో చురుగ్గా వ్యవహరించేవాడని, అలాంటి కార్యకర్తను కోల్పోవడం బాధాకరమన్నారు. ఇంకా మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, నాయకులు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాజీ దొంతు శారద బాలకృష్ణ, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాధనాయుడు, వల్లభనేని మధుసూనరావు తదితరులు సుభాష్‌చంద్ర మృతదేహానికి నివాళులర్పించారు. అందరితో కలివిడిగా వుండే సుభాష్‌చంద్ర మృతి చెందాడని తెలియడంతో వెంకటగిరి, డక్కిలి ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం తరలివచ్చి నివాళులర్పించారు.

వెట్టిచాకిరి నుంచి చిన్నారులకు విముక్తి



చైల్డ్‌కేర్ హోమ్ వద్ద చిన్నారులతో పోలీసులు, అధికారులు

వాకాడు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పలు ప్రాంతాల్లో బాల కార్మికులుగా వెట్టిచాకిరి చేస్తున్న నలుగురు చిన్నారులకు పోలీసులు బుధవారం విముక్తి కలిగించారు. ఎస్‌ఐ నాగబాబు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని పులింజరివారిపాళెంలో గత ఐదేళ్లుగా నివాసం ఉంటున్న విరగరాజు, పద్మ దంపతులు విడాకులు తీసుకొన్నారు. కుమారులు చెంచుకృష్ణ(15), రాఘవ(9), కుమార్తెలు పల్లవి (12), భూమిక(8)ను చదువు మాన్పించేసిన పద్మ ముట్టెంబాక, గొల్లపాళెం గ్రామాల్లో రొయ్యల గుంట వద్ద పనిలో పెట్టింది. తాను కూడా అక్కడే పనిచేసేది. ఈ నేపథ్యంలో మరో యజమాని వద్ద డబ్బు తీసుకొని పిల్లలను అతడి వద్ద వదిలేసేందుకు ప్రయత్నించింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు పిల్లలను తీసుకెళ్లి ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ సమతకు అప్పగించారు. అనంతరం చైల్డ్‌కేర్ హోమ్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో మునికుమారి, సూపర్‌వైజర్లు బుజ్జమ్మ, కవిత, అట్రాసిటీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష



దీక్ష చేస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు

గూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్ల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష బుధవారం 7వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకులు మాట్లాడుతూ డిపో మేనేజరు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్‌కు చెందిన కండక్టర్లు, డ్రైవర్లను అక్రమంగా సస్పెండ్ చేయడం మంచి పద్ధతి కాదన్నారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రవీంద్ర, ఎంఎస్ వాసు, రాము, శ్రీదర్, సుధాకర్, రాజు, శేషయ్య, రమణయ్య, గురవయ్య, సుధీర్, శ్రీనివాసులు, చంద్రయ్య, కేఆర్ దాసరి తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం ఉద్యమాలే శరణ్యం



సీనియర్ పెన్షనర్లను సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హక్కుల కోసం ఉద్యమాలే శరణ్యమని పలువురు పెన్షనర్లు అన్నారు. కోటలోని షాదీమంజిల్‌లో బుధవారం ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ 20వ వార్షికోత్సవం జరిగింది. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భోగేశ్వరం మాట్లాడుతూ పెన్షనర్లకు దీర్ఘకాలికంగా రావాల్సిన పీఆర్సీ, డీఏ బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. పెన్షనర్లకు గతంలో లాగా 10, 15 శాతం అడిషనల్ క్వాంటం ఇవ్వాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతర భృతిని అందించాలని డిమాండ్ చేశారు. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జెన్ని ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, రాఘవయ్య, జనార్ధనం, మౌలానా సాహెబ్, యామనరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆవిర్భావ దినోత్సవం

నాయుడుపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం నిర్వహిం చారు. పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి లోకేష్ టీఎంఆర్ విద్యాసంస్థల అధినేత తంబిరెడ్డి మనోహర్‌రెడ్డికి పండ్ల మొక్కలు అందించారు. కార్యక్రమంలో ప్రసాద్, నరేంద్ర, రామయ్య, సుధీర్, సాయి తదితరులు పాల్గొన్నారు.



మనోహర్‌రెడ్డికి పండ్ల మొక్కలు అందజేస్తున్న లోకేష్, కిషోర్ తదితరులు

వేనాడులో అయ్యప్పస్వామి దీపోత్సవం



అయ్యప్పస్వామి గ్రామోత్సవం

తడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేనాడులో అయ్యప్పస్వామి దీపోత్సవం ఘనంగా జరిగింది. గ్రామంలోని రామ మందిరం వద్ద నుంచి అయ్యప్ప భక్తబృందం దీపోత్సవాన్ని ప్రారంభించింది. అయ్యప్పస్వామి చిత్రపటాన్ని గ్రామోత్సవ ప్రభలో కొలువుదీర్చి ఊరేగించారు. అయ్యప్ప భక్త బృందం భజనలు చేస్తుండగా మహిళలు దీపాలు చేతపట్టుకొని దీపోత్సవం నిర్వహించారు.



దీపాలతో మహిళలు





పునబాక వద్ద గోతులమయంగా మారిన తారు రోడ్డు - చావాలి చెక్‌పోస్టు వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

దారుణంగా రహదారులు

అడుగడుగునా గుంతలతో వాహనదారుల ఇబ్బందులు

పెళ్లకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు రహదారులు దారుణంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పడి వర్షపు నీరు చేరడంతో జనం రోడ్లపై ప్రయాణం చేయలేక అవస్థలు పడుతున్నారు. చావాలి చెక్‌పోస్టు వద్ద 71వ జాతీయ రహదార నుంచి శిరసనంబేడు, చెంబేడు గ్రామాల మీదుగా శ్రీకాళహస్తికి వెళ్లే బీటీ రోడ్డు అడుగడునా గోతులుపడి కనీసం నడిచి వేళ్లేందుకు కూడా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అదేవిధంగా శిరసనంబేడు రాజుపాలెం నుంచి బంగారంపేట మీదుగా మోదుగులపాలెం వెళ్లే బీటీ రోడ్డు పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. గుర్రప్పతోట జాతీయ రహదారి నుంచి కప్పగుంటకండ్రిగ మీదుగా పాలచ్చూరుకు వెళ్లే బీటీ రోడ్డు పూర్తిగా తారు లేచిపోవడంతో అనేక గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్లు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇంకా నీళ్లలోనే పంటలు

మళ్లీ ముసురుతో రైతుల ఆందోళన

నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఇటీవల కురిసిన వర్షాలతో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. నాయుడుపేట మండలంలో రబీ సీజన్‌లో 7,900 ఎకరాల్లో రైతులు వరినాట్లు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దాదాపు 500 ఎకరాల వరి నీటమునిగి దెబ్బ తినిన్నట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా బుధవారం నుంచి ముసురుతో కూడిన వర్షం ప్రారంభం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పుదూరులో వరదనీటిలో మునిగి వున్న వరిపైరు

ఎన్‌బీకేఆర్‌తో జపాన్ సంస్థ ఒప్పందం



ఒప్పంద పత్రాలతో ఎన్‌బీకేఆర్ డైరెక్టర్, జపాన్ సంస్థ ప్రతినిధులు

కోట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల జపాన్‌కు చెందిన మెడిన్‌షా కార్పొరేషన్ సంస్థతో సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్య బదలాయింపు అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. మెడిన్‌షా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయమాతో, డైరెక్టర్ టకాయికి, కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వినయ్‌సిమ్హా, నాయుడుపేట మండలం మేనకూరులోని కంపెనీ హెడ్ రమేష్‌చంద్రా సింగ్, హెచ్‌ఆర్ మేనేజింగ్ చైతన్య, కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈసందర్భంగా డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి ఒప్పందాల ద్వారా ప్రముఖ కోర్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, గత ఐదేళ్లలో 30మంది విద్యార్థులు మెడిన్‌షా సంస్థలో పనిచేస్తున్నట్లు తెలిపారు. కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ కోయమాతో మాట్లాడుతూ ఇక్కడ కళాశాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం వల్ల తమ సంస్థకు ఎంతో ఉపయోగం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ విక్రమ్‌కుమార్, ట్రిపుల్ ఈఈ విభాగాధిపతి ప్రభాకర్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు ఉన్నారు.

అన్ని సమస్యలకూ పరిష్కారం

పెళ్లకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో అందే ప్రతి అర్జీని పరిశీలించి అన్ని సమస్యలకూ పరిష్కారం చూపుతామని పెళ్లకూరు తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అనకవోలు గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందించారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, రాష్ట్ర తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్ నాయుడు తనకు సంబంధించిన భూముల్లో వరినాట్లు వేస్తుండగా అది చెరువు పోరంబోకు అంటూ కొంతమంది అడ్డుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. తహసీల్దార్, డివిజన్, మండల సర్వేయర్లు సర్వేచేసి అది చెరువు పోరంబోకు కాదని, పట్టా భూమేని నివేదిక ఇచ్చారని తెలిపారు. అయితే రెండేళ్లుగా పంటలు వేయకుండా అడ్డుకున్న వారిపై చర్యలు తీసుకుని నష్టపరిహారం అందించాలని కోరారు. అదేవిధంగా గ్రామానికి చెందిన సుమారు 17 ఎకరాల పట్టా భూమిని ఓ రైతు ఆక్రమించుకున్నారని యాళ్ల వెంకటాచలం నాయుడు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సంతోషీబాయి, వీఆర్వో వంశీకృష్ణ, మండల సర్వేయర్ పూజిత, లక్ష్మణ్, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు దామెర ప్రసాద్‌నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్ మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి(ఆంధ్రజ్యోతి) మండలంలోని అరిగేపల్లి, కాట్రగుంట గ్రామాల్లో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పాసు పుస్తకాలు, 1బీ నమోదు కోసం 7, పక్కాగృహం, సాగుభూమికి హక్కులు కల్పించాలని ఒకటి చొప్పున అర్జీలు అందాయి. ఎంపీటీసీ రామయ్య ఆర్‌ఐ శ్రీకాంత్, సర్వేయర్ తారకరామారావు తదితరులు పాల్గొన్నారు.

డక్కిలి(ఆంధ్రజ్యోతి): మండంలోని దందవోలు గ్రామంలో బుధవారం తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది.

చిల్లకూరు(ఆంధ్రజ్యోతి) మండంలోని తొనుకుమాలలో తహసీల్దార్ శ్రీనివాసులు ఆధ్వర్యలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సాగు భూములకు పట్టాలు, ఇళ్ల స్థలాలు మంజూరు, సర్వే తదితర సమస్యలు పరిష్కరించాలని 23 వినతులు అందాయి. ఆర్‌ఐ పూర్ణ, నాయకులు కుమార్ యాదవ్, విజయ్ భాస్కర్, త్రివిక్రమ్ భూపతి పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ద్వారకానాథరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణయ్య తదితరులు

ఓజిలి(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం సగుటూరులో తహసీల్దారు పద్మావతి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. గ్రామంలో నెలకొన్న సమస్యలను రైతులు తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. అలాగే పలువురు రైతులు భూసమస్యలపై అర్జీలు ఇచ్చారు.

కోట(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వంజివాకలో తహసీల్దారు జయజయరావు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. భూ సమస్యలపై రైతులు వినతిపత్రాలు అందజేశారు. సర్వేయర్ గోపీరెడ్డి, ఆర్‌ఐ మధులత పాల్గొన్నారు.

వాకాడు(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుమూరు, యడగాటిపల్లి గ్రామాల్లో తహసీల్దారు రామయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ సందీప్, టీడీపీ నాయకులు కుంచం దయాకర్, పంత్రాంగం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతకు నేదురుమల్లి పరామర్శ

వెంకటగిరి టౌన్, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని టీచర్స్ కాలనీ 9వ వార్డుకు చెందిన గంగిరెడ్డి కృష్ణారెడ్డి మామ ఆదినారాయణరెడ్డి మృతి చెందారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కల్యాణి, బాలయ్య, వహిదా, సుబ్బారావు, శ్రీనివాసులు, ప్రసాద్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, పేచిరాజ్, దశయ్య, నాగయ్య, సధారెడ్డి పాల్గొన్నారు.

గూడూరులో మోస్తరు వర్షం

గూడూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి) బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గూడూరులో బుధవారం ఉదయం నుంచి విడతలు విడతలుగా మోస్తరు వర్షం కురుస్తోంది. పట్టణంలోని పలు వీధుల్లో వర్షపు నీరు నిల్వ చేరింది. ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే పాదాచారులు, వాహనదారులు అవస్థలు పడ్డారు. అదే విధంగా చిల్లకూరులో ఉదయం నుంచి మోస్తరు వర్షం కురిసింది.

ఓజిలిలో జల్లులు

ఓజిలి, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం ఉదయం నుంచి ముసురేసింది. మధ్యాహ్నం నుంచి జల్లులు పడ్డాయి. సాయంత్రం 4గంటలకే చీకట్లు అలుముకుని పొద్దుపోయిన వాతావరణం ఏర్పడింది. కాగా, పొగమంచు ఎల్లి పైర్లపై ప్రభావం చూపి తెగుళ్లు వ్యాపించే అవకాశం ఉందని రైతులు ఆందోళన పడుతున్నారు.

వేదవిజ్ఞాన వ్యాప్తికి టీటీడీ కృషి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): వేద విజ్ఞానాన్ని వ్యాప్తి చేసేందుకు టీటీడీ అవిరళ కృషి చేస్తోందని ఈవో శ్యామలరావు స్పష్టం చేశారు. వేద విశ్వవిద్యాలయ అభివృద్ధిపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్షించారు. 2006లో వేద విశ్వవిద్యాలయాన్ని టీటీడీ ఏర్పాటు చేసిందని, అప్పటి నుంచి వేద విద్య బోధన, పరిశోధన, విస్తరణకు కృషి చేస్తోందని చెప్పారు. త్రికోణమితి, గణిత, ఖగోళశాస్త్ర విషయాలు వేదాల్లో ఉన్నాయని, ఈ విషయాలను సాధారణ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఐఐటీ సహకారంతో వేదసారాన్ని ఈ తరానికి అందించే విషయాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అనంతరం వేదవిశ్వవిద్యాలయంలోని క్లాస్ రూములు, హాస్టళ్లు, రికార్డింగ్ స్టూడియో, తాళపత్ర గ్రంథాలను పరిశీలించారు. వేద వాఙ్మయానికి చెందిన శుక్ల యజుర్వేద వాజసనేయ ప్రాది సాఖ్యము, సేవది పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేద వర్సిటీ వీసీ రాణీసదాశివమూర్తి, జేఈవో గౌతమి, రిజిస్ట్రార్ రాధాగోవిందత్రిపాఠి పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుతో ఎన్నో ప్రయోజనాలు



సభ్యత్వ కార్డులు అందజేస్తున్న సంచి కృష్ణయ్య, ప్రసాద్‌నాయుడు, శేఖర్‌నాయుడు

పెళ్లకూరు, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వం తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య అన్నారు. బుధవారం మండలంలోని అనకవోలు గ్రామంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు దామెర ప్రసాద్ నాయుడు, వట్టికుండల శేఖర్ నాయుడు, నేలవల్లి సిద్దులయ్య నాయుడు, మదన్‌మోహన్ నాయుడు, వెంకటాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

20న వక్తృత్వ, వ్యాసరచన పోటీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన వక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. తెలుగు, ఇంగ్లిష భాషల్లో డిగ్రీస్థాయి విద్యార్థులకు ఈపోటీలు నిర్వహిస్తారు. విజేతలకు మొదటి స్థానానికి రూ.3 వేలు, రెండో స్థానానికి రూ.2 వేలు, మూడవ స్థానానికి రూ.1500 అందజేస్తారు. వివరాలకు 9393620006లో సంప్రదించాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు రాజారెడ్డి కోరారు.

ప్రభుత్వ వసతి గృహాల్లో మరమ్మతులు వేగవంతం చేయండి

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం సాంఘిక సంక్షేమశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సంక్షేమ వసతి గృహాల్లో మరమ్మతులకు ప్రభుత్వం నిధులు కేటాయించిందని తెలిపారు. పనులను నాణ్యతగా చేయాలని ఆదేశించారు.

చిన్నారులపై అకృత్యాలను అరికట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ చెంచుబాబు, వేదికపై సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నారులపై జరుగుతున్న అకృత్యాలను అరికట్టాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. నాయుడుపేట ఐసీడీఎస్ కార్యాలయంలో నాయుడుపేట, ఓజిలి, పెళ్లకూరు మండలాలకు చెందిన అంగన్‌వాడీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అంగన్‌వాడీలు చిన్నారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. పిల్లలకు కొత్తవారు వచ్చి ఏమైనా చెబితే అంగన్‌వాడీలకు, తల్లిదండ్రులకు తెలియజేసేలా అవగాహన కల్పించాలన్నారు. తిరుపతి జిల్లా వన్‌స్టాఫ్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ రోజామణి మాట్లాడుతూ మహిళల పట్ల గృహహింస, చిన్నపిల్లల మీద జరుగుతున్న అకృత్యాలు, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఎస్ సీడీపీవో ఉమామహేశ్వరి, అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంఘమేశ్వరరావు, ఓజిలి ఎస్‌ఐ స్వప్న పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధి సాధించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాస్టర్ ట్రైనర్ అశోక్‌కుమార్, పక్కన ఏపీఎస్ ఐఆర్‌డీ రాష్ట్ర పరిశీలకులు రమేష్, ఎంపీడీవో సురేష్‌బాబు

నాయుడుపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను 2030 నాటిని సాధించాలని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర పరిశీలకుడు రమేష్ అన్నారు. నాయుడుపేట మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, సచివాలయ సిబ్బంది శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. పంచాయతీల అభివృద్ధికి అందరూ సమన్వయంతో పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. గ్రామాల్లో అందరికీ విద్య, పౌష్టికాహారం, వైద్యం అందేలా చూడడంతో పాటు పేదరికాన్ని రూపుమాపాలన్నారు.

ఇంధన పొదుపుపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఏడీఈ శేఖర్ బాబు, పక్కన ఏఈ మురళి, ప్రిన్సిపాల్ సుప్రియ

తడ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూళ్లూరుపేట ఏడీఈ శేఖర్ బాబు మాట్లాడుతూ ఇంధన పొదుపు వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ మురళి, ప్రిన్సిపాల్ సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

21న జిల్లాస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ మైదానంలో ఈ నెల 21వ తేదీన జిల్లాస్థాయి క్రాస్ కంట్రీ అథ్లెట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి చిత్తూరు జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాబర్ట్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 16 బాలబాలికలు 2 కిలో మీటర్లు, అండర్ 18 బాలురకు 6 కిలోమీటర్లు, బాలికలకు 4 కిలోమీటర్లు, అండర్ 20 బాలురకు 8 కిలోమీటర్లు, బాలికలకు 6 కిలోమీటర్లు, 20 ఏళ్ల పైబడిన పురుషులకు, స్త్రీలకు 10 కిలోమీటర్లు పరుగు పోటీలు జరుగుతాయని వివరించారు. రాణించిన క్రీడాకారులు ఈనెల 28న వైజాగ్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధిస్తారు. మరిన్ని వివరాలకు 8686867079ను సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచే ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో 27వ ఇంటర్ డిస్ట్రిక్ట్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్(2024-25) శుక్ర, శనివారాలలో నిర్వహించనున్నారు. ఈ మేరకు శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు దానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. 13 జిల్లాల నుంచి 350మందికిపైగా బాలురు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. ఎస్వీ పాలిటెక్నిక్ వైస్ ప్రిన్సిపాల్ గౌరీశంకర్, హెడ్ ఆఫ్ ఫార్మసీ జి.కృష్ణమూర్తినాయుడు, కాలేజీ పీఆర్వో కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ప్రమాదం రేణిగుంట - మామండూరు మార్గంలో వెలుగు చూసింది. రైల్వే జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాలు... రేణిగుంట - మామండూరు మార్గంలో పట్టాల పక్కన వ్యక్తి మృతి చెందినట్టు అటుగా వెళ్తున్న స్థానికులు గుర్తించి సమాచారం ఇచ్చారన్నారు. సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించామన్నారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటాయని, బ్లూ కలర్ షర్టు, నల్ల జీన్స్ ప్యాంటు వేసుకుని ఉన్నాడన్నారు. మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జగన్ - అదానీ అవినీతిపై విచారణ జరపాలి: సీపీఎం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్, పారిశ్రామికవేత్త అదానీ అవినీతిపై విచారణ జరపాలని సీపీఎం ఏరియా కార్యదర్శి గంధం మణి డిమాండ్ చేశారు. ప్రజలకు నష్టాన్ని చేకూర్చే సెకీ ఒప్పందాన్ని 'నమో అదానీ... కరెంటు కహానీ' పేరిట ప్రచురించిన కరపత్రాలను బుధవారం పట్టణంలో పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సెకీ ఒప్పందంపై ఇంత వరకు కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించకపోవడం సరికాదన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను పెంచబోమంటూనే ట్రూఅప్, ఇంధన సర్దుబాటు సెస్ పేరిట రూ.17,500కోట్లు భారం మోపిందని మండిపడ్డారు. గత ఎన్నికల ప్రచారంలో స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని పిలుపునిచ్చిన కూటమి నేతలు ఇప్పుడు ఎర్ర తివాచీ పరచి స్వాగతించడం సిగ్గుచేటన్నారు. ప్రజా వ్యతిరేక విద్యుత్ సంస్కరణలను ఇప్పటికైనా ఆపకపోతే గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందన్నారు. పి.గురవయ్య, సంక్రాంతి వెంకటయ్య, గురునాథం, కుమార్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తాం

పంచాయతీ కార్మికుల హెచ్చరిక


జిల్లా పంచాయతీ అధికారితో మాట్లాడుతున్న సీపీఐ నాయకులు, కార్మికులు

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తామని రేణిగుంట పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. ఆ మేరకు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవికి సీపీఐ నాయకులతో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ నవంబరు నెల జీతాలు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. అలాగే పీఎఫ్ ఏడు నెలలుగా పట్టుకుంటున్నా జమ చేయలేదన్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదన్నారు. దీంతో జిల్లా అధికారి దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. ఈనెల 28వ తేదీలోపు జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

సిమెంటు రోడ్డు నిర్మాణాలు వేగవంతం చేయండి


పాతవీరాపురంలో అధికారులకు సూచనలిస్తున్న డ్వామా పీడీ

ఏర్పేడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి):మండలంలో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణాలను వేగవంతం చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ ఆదేశించారు. పాతవీరాపురంలో సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టనున్న మట్టి రోడ్డును ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. సిమెంటు రోడ్డు నిర్మించిన వారం రోజుల్లో మెటీరియల్ బిల్లు మంజూరవుతోందని, వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. సిమెంటు రోడ్డు నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై చర్యలు తీసుకుంటామన్నారు. మొత్తం 35 పనులకు గాను రూ.1.75కోట్లు మంజూరైతే కేవలం రూ.6.50లక్షలతో మూడు పనులు చేయడంపై ఆయన మండిపడ్డారు. అధికారులు చంద్రశేఖర్‌రాజు, దేవరి, రవితేజ, శాలి మనోహర్, బాలాజీరావ్, పాతవీరాపురం రవి, కార్యదర్శి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రమంత్రి రామ్మోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడికి జ్ఞాపిక అందజేస్తున్న దశరథాచారి

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర విమానాయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడికి టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గుమ్మడిపూడి దశరథాచారి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం న్యూఢిల్లీలో మంత్రిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కలంకారీ కండువాతో సత్కరించి కొయ్య వినాయక ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా విమానాశ్రయంలోని దుకాణ సముదాయాల్లో భారత హస్తకళలు, చేనేత, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల కళాకారులను ప్రోత్సహించే విధంగా ప్రదర్శనకు అవకాశం కల్పించాలన్నారు. దీని ద్వారా భావి తరాలకు మన దేశీయ కళల ప్రాముఖ్యం తెలుస్తుందన్నారు. అందుకు కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు దశరథాచారి తెలిపారు.

వర్షాలకు తెగిన వరవ కాలువ పరిశీలన



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్ అనంతపురం, తంగేళ్లపురం, విజయగోపాలపురం చెరువు కలుజుల నుంచి వచ్చే వరవ కాలువ గత వారం కురిసిన భారీ వర్షాలకు తెగిపోవడంతో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ మూడు చెరువుల నిండి వరవ కాలువ పారడంతో పొలాలు నీట మునిగిపోతున్నాయని తెలిపారు. వరవ కాలువ తెగిన చోట కల్వర్టు నిర్మాణం చేపట్టాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో నిర్మాణం చేపడుతామని తెలిపారు.

నవీన్ కుటుంబాన్ని ఆదుకుంటాం

వరదయ్యపాళెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నవీన్ కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం చెప్పారు. తన ఇద్దరు పిల్లలతో నవీన్ భార్య బుధవారం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసింది. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా సాయం అందించి ఆదుకుంటామన్నారు.

పనస కాలువ కబ్జా

పట్టించుకోని రెవెన్యూ అధికారులు


రామచంద్రాపురం వద్ద ఆక్రమణకు గురైన పనస కాలువ

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని రామచంద్రాపురం వద్ద మూడున్నర సంవత్సరం క్రితం పనస కాలువ కబ్జాకు గురైంది. అప్పట్లో స్థానికులు దీనిపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అయినా అప్పటి వైసీపీ పాలకులు, అధికారులు కనీసం కాలువ కబ్జాపై ఊసే ఎత్తలేదు. శ్రీకాళహస్తి- పిచ్చాటూరు రహదారికి అనుకుని పనసకాలువ భూమి ఉంది. రాజీవ్‌నగర్ నుంచి తొట్టంబేడు మండలం పెద్దకన్నలి చెరువు వరకు ఈ పనస కాలువ ప్రవహిస్తుంది. రాజీవ్ నగర్ వద్ద రహదారికి ఆనుకుని ఉన్న కాలువను గత వైసీపీ పాలనలో పెద్దఎత్తున ఆక్రమించి ప్లాట్లుగా మార్చేశారు. ఆక్రమిత కాలువ భూమిని విచ్చలవిడిగా అమాయకులకు అమ్మి సొమ్ము చేసుకున్నారు. దీనిపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమయ్యాయి. రాజీవ్‌నగర్‌లో ఆక్రమణలు తొలగించాలంటూ స్థానికులు కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డికి ఎన్నికల సందర్భంగా మొర పెట్టుకున్నారు. రాజీవ్‌నగర్‌వాసులకు హామీ ఇచ్చిన ప్రకారం ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత సుధీర్‌రెడ్డి కాలువ పోరంబోకు స్థలంలో నిర్మించిన 105 అక్రమ కట్టడాలను అధికారులతో కలిసి కూల్చివేయించారు. రాజీవ్‌నగర్ తరహాలోనే ఇక్కడి సమీపంలోని రామచంద్రాపురం వద్ద పిచ్చాటూరు రహదారికి ఆనుకుని ఉన్న పనస కాలువ భూమిపై నాలుగేళ్ల క్రితం కొందరు కన్నేశారు. 2021 సంవత్సరం జూలైలో అక్కడ రెండు దుకాణాలను నిర్మించుకున్నారు. ఆరు నెలల క్రితం రాజీవ్‌నగర్‌లో అక్రమ కట్టడాలను అధికారులు కూల్చివేసినప్పటికీ రామచంద్రాపురం వద్ద మాత్రం విస్మరించారు. దీనిపై స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమవుతోంది. రామచంద్రాపురం వద్ద కూడా కాలువను సర్వే చేసి అక్రమ నిర్మాణాలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోండి: ఎమ్మెల్యే సుధీర్


అర్జీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని ఎమ్మెల్యే సుధీర్ అన్నారు. శ్రీకాళహస్తి మండలంలోని ముచ్చివోలులో బుధవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ... గత ఐదు సంవత్సరాల్లో కబ్జాకు గురైన భూములు, ప్రభుత్వ భూములు, ఇతర భూ సమస్యలను సదస్సుల్లో పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. పరిష్కారం కోసం ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. అర్జీలను నిర్ణీత గడువు లోపు పరిష్కరించాలని అధికారులను కోరారు. తహసీల్దారు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇక తొట్టంబేడు మండలం చోడవరం పంచాయతీలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆర్ అనంతపురంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. టీడీపీ నాయకులు సుబ్రమణ్యం, మణి, డీటీ చంద్రబాబు నాయుడు, ఆర్ఐ నల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మండలంలోని కృష్ణాపురంలో బుధవారం తహసీల్దారు సురేష్‌బాబు ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 11 దరఖాస్తులు అందాయి. ఆర్ఐలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు: మండలంలోని ముసలిపేడు పంచాయతీ బత్తెనయ్య గిరిజనకాలనీకి జరిగిన రెవెన్యూ సదస్సులో 95మంది తమకు భూములు కేటాయించినా ఆన్‌లైన్‌లో ఎక్కించలేదని అధికారులకు వినతిపత్రాలు అందించారు. రెండ్రోజుల్లో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ భార్గవి చెప్పారు. మొత్తం 32 వినతులు వచ్చినట్లు ఆమె తెలిపారు. టీడీపీ నేతలు ధనంజయులునాయుడు, నాగరాజునాయుడు, అంకయ్య, మనోహర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండలంలోని వెంగళత్తూరు సచివాలయం వద్ద బుధవారం తహసీల్దార్ రమేష్‌బాబు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్నింటికి 30 రోజుల గడువుతో రసీదులు అందించారు. సదస్సుకు తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ సుధాకర్, ఏవో మధుసూదన్ తదితరులు హాజరయ్యారు.

స్థానిక పాలనపై అవగాహన అవసరం


శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న ఈటీసీ ప్రిన్సిపాల్ నాగపద్మజ

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): పరిపాలనపై అవగాహన అవసరమని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ నాగపద్మజ అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి రెండు రోజుల శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంచాయతీల సుస్థిర అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. చిత్తూరు జిల్లాలోని బొమ్మసముద్రం గ్రామాన్ని ఉత్తమ ఆరోగ్య గ్రామంగా గుర్తించి జాతీయ అవార్డుకు ఎంపిక చేశారని చెప్పారు. ప్రతి పంచాయతీ ఇటువంటి అవార్డులను పొందడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఈవోపీఆర్డీ ప్రభురావు, మండల అధికారులు పాల్గొన్నారు.

కేవీబీపురం: గ్రామాల సుస్థిర అభివృద్ధికి సర్పంచులు, అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది సహకరించాలని ఎంపీడీవో రాధారాణి తెలిపారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణలో పారిశుధ్యం, తాగునీరు, ఆరోగ్యం, ప్రాథమిక విద్య, మౌలిక వసతు లపై ఆయా శాఖల అధి కారులు ప్రణాళికా బద్ధం గా అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలపై ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈవో పీఆర్డీ రాజశేఖర్, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహ్మద్‌రఫి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ ఇచ్చారు.

పవర్ లైన్ షిఫ్టింగ్ పరిశీలన


ట్రాన్స్‌కో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరుపతి విమానాశ్రయం సమీపంలో 132 ఈహెచ్‌టీ అండర్ గ్రౌండ్ పవర్ కేబుల్ 6 లైన్ షిఫ్టింగ్ పనులను కలెక్టర్ వెంకటేశ్వర్ బుధవారం పరిశీలించారు. ఈ పనుల నిమిత్తం నిధుల కోసం ట్రాన్స్‌కో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ఆచరణాత్మక ప్రణాళికతో పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్, ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, తహసీల్దారు సురేష్‌బాబు, విమానాశ్రయ, ట్రాన్స్‌కో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తూర్పున ముసురు



శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో బుధ వారం ముసురు వాతావరణం నెలకొంది. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. చలి గాలులు అధికమయ్యాయి. బుధవారం ముసురు వాతావరణంతో అడపాదడపా తేలికపాటి జల్లులు కురిశాయి. అయితే చలి తీవ్రత పెరగడంతో పట్టణంలో జనసంచారం తక్కువగా కనిపించింది.

గుడిమల్లం ఆలయానికి రూ.25వేల విరాళం

ఏర్పేడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయానికి కోనసీమ జిల్లా రాయవరం మండలం పసలపూడికి చెందిన చిన్నం సత్తిరెడ్డి బుధవారం రూ.25వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు స్వామి అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులు ఆయనను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పరమేశ్వరుడి సేవలో ఎమ్మెల్యే బొజ్జల సతీమణి

ఏర్పేడు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని కుటుంబ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, మాజీ చైర్మన్ గిరినాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించి సత్కరించారు.

వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి) : వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి దేవళ్ల రమణ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రం తరహాలో ఏపీలో కూడా వడ్డెర్లను ఎస్టీలో చేర్చాలని పార్లమెంటు సమావేశాల్లో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ప్రసంగించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి స్పందించి రాష్ట్రంలో కూడా వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

తెలంగాణ మాజీ మంత్రికి ఘన స్వాగతం

రేణిగుంట, డిసెంబరు 18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి తలసాని శ్రీనివాస యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది. శ్రీవారి దర్శనార్థం హైదరాబాదు నుంచి కుటుంబసభ్యులతో బుధవారం విమానాశ్రయం చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ గౌడ్, యాదవ సంఘం నాయకులు హేమంత్‌కుమార్ యాదవ్, తులసీయాదవ్ తదితరులు స్వాగతం పలికారు. తర్వాత రోడ్డు మార్గాన టీటీడీ మాజీ చైర్మన్ పుట్టా సుధాకర్ యాదవ్‌తో కలిసి ఆయన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

మోదీది నియంతృత్వ పాలన: కాంగ్రెస్

శ్రీకాళహస్తి, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రధాన నరేంద్రమోదీ నియంతృత్వ పాలన సాగిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ బత్తెయ్యనాయుడు ఒక ప్రకటనలో విమర్శించారు. జమిలి ఎన్నికలు నిర్వహించి తన నియంతృత్వ పాలనలో హిందూ దేశంగా చలామణి చేయాలని ఆయన ఉద్దేశమన్నారు. బిల్లు పాస్ కావాలంటే 2/3వంతుల మెజార్టీ అవసరమన్నారు. కానీ రాకపోవడంతో జేపీసీకి పంపారన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలు విద్యకు తొలి మెట్టు

పిచ్చాటూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశకు అంగన్‌వాడీ కేంద్రాలు తొలి మెట్టు అని సీడీపీవో శోభారాణి అన్నారు. చిన్న పిల్లల ఎదుగుదలకు బాల్య దశలో పౌష్టికాహారం అందిస్తుండడంతో వారికి సంపూర్ణ ఆరోగ్యంతో పాటు పరిపూర్ణ మేధాశక్తి లభిస్తుందన్నారు. బుధవారం స్థానిక ప్రాజెక్టు కార్యాలయంలో ప్రీ స్కూలు ఎడ్యుకేషన్‌పై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. బాల్య వివాహాలపైనా అవగాహన కల్పించారు. ఎంపీడీవో మహ్మద్‌రఫి, మండల కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, సూపర్‌వైజర్ మారెమ్మ, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

గుబులు పుట్టిస్తున్న గూళూరు చెరువు

మరమ్మతులకు నోచుకోని తూములు ● భయాందోళనలో దిగువ ప్రాంతవాసులు




ఆదిఆంధ్రవాడకు చేరిన గూళూరు చెరువు నీళ్లు - పూడి పోయిన మిట్ట తూము, తగ్గు తూము

వడమాలపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): నిండకుంటే చింత.. నిండితే మంట అన్నట్లుగా ఉంది ఎస్వీఆర్‌పురం గూళూరు చెరువు పరిస్థితి. ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉన్న ఈ చెరువు 480 ఏకరాల విస్తీర్ణంలో ఉంది. ఇందులో 125 ఎకరాల మేరకు ముంపు పట్టా భూములు న్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి కలుజు పారింది. ఇప్పటికీ నీరు చేరుతోంది. గత కొన్నే ళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో తూములు పూడి పోయాయి. దీంతో కాలువల ద్వారా వచ్చే నీటితో చెరువు నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో దిగువ ప్రాంతంలోని ఆది ఆంధ్ర వాడవాసులు ఎప్పుడు ముంపుకు గురువుతామో అంటూ భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే చెరువు నీళ్లు ఆదిఆంధ్ర వాడ దిగువ వీధుల్లోకి చేరింది. సంబంధిత అధికారులు స్పందించి తూములకు మరమ్మతులు చేపట్టి నీటిని దిగువకు వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు. కాగా ఎస్వీఆర్‌పురంలో ఈనెల 19న గురువారం జరగనున్న రెవెన్యూ సదస్సులో మూకుమ్మడిగా అర్జీలు ఇవ్వాలని గ్రామస్తులు నిర్ణయించారు.

శ్మశానాలకు స్థలాలు ఇవ్వాలని అర్జీ



సదస్సులో ప్రసంగిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెబీఆర్‌పురం పంచాయతీలోని రెండు దళితవాడల శ్మశానాలకు స్థలాలు లేవని బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో దళితవాడవాసులు తహసీల్దార్ వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆయన శ్మశానం కోసం స్థలాలను పరిశీలించారు. ఈ సదస్సులో ఆర్ఓఆర్‌కు 18, ఇళ్ల పట్టాలకు 32, ఎఫ్ లైన్‌కు 8, జాతీయ రహదారి నష్టపరిహారానికి దరఖాస్తులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మోహన్‌రాజు, మామిడి రైతు సంఘ అధ్యక్షుడు కేశవులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

టీడీపీ నాయకుడికి నివాళి


కొత్తరాజు భౌతికకాయానికి నివాళి అర్పిస్తున్న ధనంజయులు

వడమాలపేట, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు దొమ్మరాజు కృష్ణమరాజు(కొత్తరాజు) భౌతికకాయానికి ఆ పార్టీ మండల నాయకులు నివాళులర్పించారు. మండలంలోని ఎస్వీపురం పంచాయతీ జానావారి కోటాలకు చెందిన కొత్తరాజు కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురై మంగళవారం మృతి చెందారు. నివాళులర్పించిన వారిలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ధనంజయులు నాయుడు, సురేష్ రాజు, లోకేష్ రాజు, మునిశేఖర్, హేమావతి, శ్రీనివాసలు నాయుడు, వెంకటేశ్వరరావ్, పట్టాభి, బత్తినాయుడు, లోకనాథం రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

వరదయ్యపాళెం, డిసెంబరు 18(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు కస్తూరయ్యకు ఎమ్మెల్యే ఆదిమూలం నివాళులర్పించారు. కడూరు హరిజనవాడకు చేరుకుని కస్తూరయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. జయచంద్రనాయుడు, శ్రీనివాసులునాయుడు, మునిభూషణమ్మ, కడూరు ఆయకట్టు అధ్యక్షుడు రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.